ప్రభాతనవ
SINGIDI
తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
ఆదివారం 12 జులై 2026 సంపుటి: 1 సంచిక: 25 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar Adilabad

## క్రీడలే వారధి..

**భారత్-న్యూజిలాండ్ మధ్య శతాబ్దపు క్రీడా సంబంధాలు: మోదీ**

క్రీడలు దేశాల మధ్య శక్తిమంతమైన వారధిగా పనిచేస్తాయన్న ప్రధాని మోదీ

ఆక్లాండ్‌లో న్యూజిలాండ్ ప్రధానితో కలిసి స్పోర్టింగ్ షోకేస్‌లో పాల్గొన్న మోదీ

భారత్‌లో 2030 కామన్వెల్త్ గేమ్స్, ఆస్ట్రేలియాలో 2032 ఒలింపిక్స్ నేపథ్యంలో సహకారం

2





### నన్ను చంపితే.. ఇరాన్ ఉనికి మాయమే: ట్రంప్

తన హత్యకు కుట్ర ప్రచారంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఒకవేళ ఇరాన్ నన్ను హత్య చేయాలని ప్రయత్నిస్తే.. 1000 క్షిపణులు ఒక్కసారిగా విరుచుకుపడతాయని హెచ్చరించారు.

**- న్యూఢిల్లీ, జులై 11 (సింగిడి)**

2



### భారత నౌకాదళంలో సరికొత్త యుద్ధనౌక 'మహేంద్రగిరి'

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**నౌకకు జెండా ఊపి జలప్రవేశం**

భారత నౌకాదళంలోకి సరికొత్త యుద్ధనౌక 'INS మహేంద్రగిరి' చేరింది. 'మహేంద్రగిరి' చేరిక..భారతదేశ సముద్ర సరిహద్దు రక్షణ బలగాల శక్తిని మరింత బలోపేతం చేయనుంది. శనివారం విశాఖపట్నంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్..'మహేంద్రగిరి' నౌకకు జెండా ఊపి జలప్రవేశం చేయించి నౌకాదళ తూర్పు విభాగానికి అంకితం చేశారు. తూర్పు కనుమల్లోని ప్రసిద్ధ పర్వత శ్రేణి పేరును ఈ నౌకకు నామకరణం చేశారు.

**- విశాఖపట్నం, జులై 11 (సింగిడి)**

2

# కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం కుదరదు

## మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచాలని ఎన్‌డిఎస్‌ఎ ఆదేశాలు



- **గేట్లు మూస్తేనే నీరు ఎత్తి పోయడానికి అవకాశం**
- **గేట్లు మూస్తే ప్రాజెక్ట కొట్టుకు పోతుందని హెచ్చరిక**
- **ప్రజలను తపరేదోవ పట్టించేలా ఈటెల వ్యాఖ్యలు**
- **బిఆర్‌ఎస్ నేతల సూచనలతోనే మాట మార్చిన ఈటెల**
- **జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి అనుమతి తెస్తే అభ్యంతరం లేదు**
- **ఈటెల, బిఆర్‌ఎస్ నేతలకే బాధ్యత అప్పగిస్తా: సిఎం రేవంత్**

కాళేశ్వరం విషయంలో తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీమంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఎంపీ ఈటల అవాస్తవాలు చెప్పారని ధ్వజమెత్తారు. ఎంపీ ఈటల అంటే తమకు గౌరవమేనని తెలిపారు. ఆ వ్యాఖ్యలతో ఈటల తన గౌరవం పోగొట్టుకున్నారని విమర్శించారు.

**- హైదరాబాద్, జులై 11 (సింగిడి)**



మధుర గాయని ఎస్.జానకి

2

## గుండెపోటుతో కన్నుమూత

- **ఆరు దశాబ్దాల కెరీర్‌లో 48 వేలకు పైగా పాటలు పాడిన గానకోకిల**
- **2013లో ప్రకటించిన పద్మభూషణ్‌ను సున్నితంగా తిరస్కరించిన వైనం**
- **కొద్ది నెలల క్రితమే ఏకైక కుమారుడిని కోల్పోయిన జానకి**
- **భారతీయ సంగీతంలో ఒక శకం ముగిసిందన్న ప్రముఖులు**



### హరీశ్ రావుపై పోటీకి నేను రె'ఢీ'

**టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

వచ్చే ఎన్నికల్లో పార్టీ ఆదేశిస్తే మాజీ మంత్రి హరీశ్ రావుపై పోటీ చేసేందుకు సిద్ధమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రకటించారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థిగా తన భార్య నిర్మలా జగ్గారెడ్డినే నిలబెడతామని స్పష్టం చేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి వచ్చే ఎన్నికల్లో తన పోటీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

**- సంగారెడ్డి, జులై 11 (సింగిడి)**

2

### మా మీద కక్షతో రైతుల నోట్లో మట్టి కొట్టకు

## రేవంత్ రెడ్డికి కేటీఆర్ హితవు



కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ కక్షతో రైతులకు అన్యాయం చేయొద్దని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. గోదావరిలో నీరు ఉన్నా ఎత్తిపోసే అవకాశాన్ని ప్రభుత్వం వినియోగించుకోవడం లేదని విమర్శించారు. మాపై రాజకీయ కక్షతో కాళేశ్వరాన్ని కూలేశ్వరంగా చూపే కుయత్నాలు చేస్తూ... గోదావరి నీళ్లను ఎత్తిపోయకుండా రైతుల నోట్లో మట్టి కొట్టవద్దని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హితవు పలికారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.

**- హైదరాబాద్, జులై 11 (సింగిడి)**

2

### కావాలనే కన్నెపల్లి పంపులు తెరవడం లేదు

## ప్రభుత్వంపై హరీష్ రావు ఆరోపణలు



ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది కాలం తెచ్చిన కరువు కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుటిల బుద్ధితో తెచ్చిన కరువు అని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. గోదావరి నదిలో కావలసినన్ని నీళ్లు ఉన్నప్పటికీ, కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న ఈర్ష్యతో కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లను ప్రభుత్వం కావాలనే ఆన్ చేయడం లేదని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం తిమ్మారు పల్లి గ్రామంలో జరిగిన పెద్దమ్మ దేవాలయ ఉత్సవాల్లో హరీష్ రావు పాల్గొని మాట్లాడారు.

**- సిద్దిపేట, జులై 11 (సింగిడి)**

### ఫోక్సో కేసు పెట్టారన్న కక్షతో ఆరుగురి దారుణ హత్య

## ఉన్మాదిలా నరమేధం..



- **విచిత్రంగా భార్యా ఇద్దరు పిల్లల నరికివేత**
- **అనంతరం గ్రామం నుంచి పరార్**
- **నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు**
- **సైకోను పట్టుకోవాలంటూ గ్రామస్థుల ఆందోళన**

2

**షాబాద్, జులై 11 (సింగిడి)**

రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దైవాలగూడలో ఆరుగురి దారుణ హత్య ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. నిందితుడు రాజ్‌కుమార్‌పై గతంలోనే ఫిర్యాదు చేసినా పోలీసులు నిర్లక్ష్యం వహించారని, సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందంటూ బాలిక తరఫు మృతుల బంధువులు, గ్రామస్థులు షాబాద్ పీఎస్ ఎదుట షాబాద్-కంది రహదారిపై బైఠాయించి భారీ ఆందోళనకు దిగారు.



### పవన్‌కు ముంబైలో 3 గంటల పాటు సర్జరీ

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్ కల్యాణ్ రెండు భుజాలకు 'రొటేటర్ కఫ్ ఇంజ్యూరీస్' సమస్య నేపథ్యంలో వైద్యులు సర్జరీ నిర్వహించారు. ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో కుడి భుజానికి వైద్యులు మూడు గంటల పాటు శస్త్ర చికిత్స చేశారు. ఒకేసారి రెండు భుజాలకు ఆపరేషన్ చేస్తే.. నొప్పి భరించలేని స్థాయిలో ఉంటుందని, అందుకే ఇప్పుడు కుడి భుజానికి సర్జరీ చేశామని, రెండు నెలల్లో ఎడమ భుజానికి సర్జరీ చేస్తామని వైద్యులు వెల్లడించారు. 2016లో పవన్‌కు ఎన్నికల ప్రచారంలో ఫ్యాన్స్ చేతులు పట్టి లాగడంతో భుజం సమస్య తీవ్రమైంది. దీంతో ఆయన సమస్య పరిష్కారానికి శస్త్ర చికిత్స చేయించు కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

2



### సెమీ కండక్టర్ రంగంలో మరో కీలక ముందడుగు

**హైదరాబాద్‌లో తొలి సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ హబ్**

**టీ-వర్క్స్‌లో హబ్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు**

సెమికండక్టర్ రంగంలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి సీఎంపీ కెమికల్ మెకానికల్ పాలిషింగ్ ప్యాడ్ టెక్నాలజీ హబ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది.

**హైదరాబాద్, (సింగిడి)**

2

# బుల్లెట్ ట్రైన్ హబ్‌గా తెలంగాణ

## గంటల్లోనే చెన్నై, ముంబై.. తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు

అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన

- **హైదరాబాద్ నుంచి విజయవాడకు గంటలో చేరుకోవచ్చన్న రైల్వే మంత్రి**
- **తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయని వ్యాఖ్య**

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఏడు బుల్లెట్ రైళ్లలో, ఏకంగా మూడు రూట్లు తెలంగాణకే దక్కడం విశేషమని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ వల్లే రాష్ట్రానికి ఈ భారీ ప్రాజెక్టులు వచ్చాయని, రాబోయే రోజుల్లో తెలంగాణ దేశంలోనే ఒక పెద్ద బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. **– హైదరాబాద్, జులై 11 (సింగిడి)**

2






### "సియోల్... అంతవరకు కమ్సహమ్నిదా"

## నారా లోకేశ్ ఆసక్తికర పోస్ట్

- **విజయవంతంగా ముగిసిన మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియా పర్యటన**
- **'పల్లి పల్లి' స్ఫూర్తితో వేగంగా చర్చలు జరిపామన్న లోకేశ్**
- **సహకరించిన వారికి 'కమ్సహమ్నిదా' అంటూ కొరియన్ భాషలో కృతజ్ఞతలు**

2



### తిరుపతిలో మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ

వర్సిటీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి

తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం కీలక ప్రకటన

గతేడాది తిరుపతి, విశాఖలో కాలేజీలు కొనుగోలు చేసిన మల్లారెడ్డి

2

# వియత్నాంలో ఘోర విషాదం

## భారతీయ పర్యాటకుల బోటు బోల్తా, 18 మంది మృతి?.. ప్రమాదంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన టూరిస్టులు!

వియత్నాంలో భారీ విషాదం జరిగింది. భారత టూరిస్టులు ప్రయాణిస్తున్న బోటు ఒకటి నీట మునిగింది. ఈ ప్రమాదంలో పర్యాటకులు గల్లంతయ్యారు. వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఇందులో తెలుగువారు కూడా ఉన్నారు. ఈ మేరకు వియత్నాం హనోయిలోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ప్రమాదం గురించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని ఎక్స్‌లో పోస్టు షేర్ చేసింది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 15 మంది చనిపోయినట్లు తెలుస్తోంది.

**- వియత్నాం (సింగిడి)**

2



ఇటీవల ఓ మొబైల్ కంపెనీ 250 మందితో కూడిన ఒక బృందాన్ని భారత్ నుంచి వియత్నాం పర్యటనకు తీసుకెళ్లింది. వీళ్లంతా మొబైల్ కంపెనీకి చెందిన డిస్ట్రిబ్యూటర్లుగా తెలుస్తుంది. అయితే ఇందులో 40 మంది తెలంగాణ, 35 మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మొబైల్ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారు.

"వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో భారత పర్యాటకులతో వెళ్తున్న ఒక పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదం అత్యంత విచారకరం. స్థానిక అధికారులు ముమ్మరంగా సహాయక చర్యలు చేపడుతున్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు, ఎంతమంది పర్యాటకులు ఉన్నారు అనే పూర్తి వివరాలను సేకరిస్తున్నాం"

– వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం




### ఓటిటి సినిమాకూ సెన్సార్ షిప్

తాజా పరిణామాలతో కేంద్రం యోచన

2

# కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం కుదరదు

ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. శనివారం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ప్రజలను తపరిదోవ పట్టించేలా బిఆర్ఎస్ నేతలు, ఎంపి ఈటెల చేస్తున్న ప్రకటనలు దారుణమని అన్నారు. డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఎన్‌డిఎస్ఎ ఇచ్చిన నివేదిక, ఆదేశాల మేరకు తాము నడుచుకుంటున్నామని స్పష్టం చేశారు. కేంద్రంలో పలుకుబడి ఉన్న బిజెపి ఎంపిగా ఈటెల రాజేందర్ జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి, ఎనడిఎసఎ ఆధ్వర్యంలో కాళేశ్వరం నీటిని ఎత్తి పోస్తే తమకు అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. ఎన్‌డిఎస్‌ను కలిసి నీటిని ఎత్తి పోసేందుకు అనుమతి తెస్తే అందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం ఉండబోదన్నారు. ఎన్‌డిఎస్ఎ ఆదేశాల మేరకు మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచామని అన్నారు. మేడిగడ్డ గేట్లు మూస్తేనే కన్నెపల్లి వద్ద పంపులు నడపడానికి వీలుంటుంద న్నారు. అలా కాకుండా పారుతున్న నీటని ఎత్తిపోయడం సాధ్యం కాదన్నారు. ఇకపోతే పట్టిసీమ కోసం నీటిని వదులుతున్నామని చేస్తున్న ఆరోపణలపైనా సిఎం మండిపడ్డారు. పోలవరం పూర్తి చేసుకునే వరకు పట్టిసీమను కట్టుకున్న విషయం ఆనాటి మంత్రి హరీష్ రావుకు తెలియదా అన్నారు. కావాలనే బురదజల్లే ప్రయత్నాలు చేయడంపై మండిపడ్డారు. ఇపరిదున్న పరిస్థితుల్లో నీటిని ఎత్తి ప ఓయడం కుదరదని సిఎం తేల్చారు. ఒకవేళ గేట్లు మూస్తే భద్రాచలం వరకు ముంపు తప్పదని ఎన్‌డిఎస్ఎ తెలిపిందని అన్నారు. కేసీఆర్ హయాంలో 2019 జూన్ 21వ తేదీన కాళేశ్వరం ప్రారంభించాక, కేసీఆర్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు బయటపడ్డాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని చెపరికొచ్చారు. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని.. 2020 మే 18వ తేదీన ఈఈ రమణారెడ్డి కేసీఆర్ ప్రభుత్వానికి లేఖ రాశారని ప్రస్తావించారు. లోపాలు సవరించాలని అప్పట్లోనే ఇంజినీర్లు సూచించారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యంతో లోపాలు పెరిగి పెద్దవై బ్యారేజ్ కుప్పకూలిందన్నారు. 2022 జులై 14వ తేదీన వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని చెప్పారు. ఇప్పటికీ కన్నెపల్లి పంప్‌హౌస్ వినియోగంలోకి రాలేదని తెలిపారు. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ప్రస్తావించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై.. కేసీఆర్ సీఎంగా ఉన్నపరిదే ఎన్డీఎస్ఏ కమిటీ ఏర్పాటు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం కావని ఎన్డీఎస్ఏ తేల్చిచెప్పిందని అన్నారు. ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ లోపాలపై.. గతంలోనే ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ఇచ్చిందని ప్రస్తావించారు. ప్రాథమిక, తుది నివేదికల్లో ఎన్డీఎస్ఏ అదే విషయం చెప్పిందని అన్నారు. లోపాలు సవరించాలని నిపుణులు చెప్పినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మొదట్లోనే స్పందించకపోవడంతో ఈ సమస్య పెద్దది అయిందని చెపరికొచ్చారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై పదేపదే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# క్రీడలే వారధి..

భారత్, న్యూజిలాండ్ మధ్య క్రీడలు ఒక శక్తిమంతమైన వారధిగా పనిచేస్తున్నాయని, ఇరు దేశాల ప్రజలను బలంగా కలుపుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో కలిసి ఆక్లాండ్‌లో జరిగిన 'స్పోర్టింగ్ షోకేస్' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ పర్యటన ద్వారా మోదీ తన క్రీడా దౌత్యానికి మరింత పదును పెట్టారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. "భారత్, న్యూజిలాండ్ మధ్య క్రీడలు ఎల్లప్పుడూ బలమైన వారధిగా నిలిచాయి. ఈ ఏడాదితో మన మధ్య క్రీడా సంబంధాలు ఏర్పడి ఒక శతాబ్దం పూర్తవుతోంది. ఆక్లాండ్‌లో ప్రధాని లక్సన్‌తో కలిసి నేను పాల్గొన్న స్పోర్టింగ్ షోకేస్‌లో అత్యాధునిక క్రీడా ఆవిష్కరణలను చూశాను. టెక్నాలజీ, సృజనాత్మకత క్రీడల భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుతున్నాయో, మన రెండు దేశాలను మరింత దగ్గరికి ఎలా చేరుస్తున్నాయో చూడటం అద్భుతంగా ఉంది" అని మోదీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడా భాగస్వామ్యాలను బలోపేతం చేయాలనే తన విస్తృత ప్రయత్నాల్లో భాగంగానే ప్రధాని మోదీ ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కొన్ని రోజుల క్రితమే ఆయన ఆస్ట్రేలియా పర్యటనలోనూ ఇదే తరహాలో క్రీడా సంబంధాలపై దృష్టి సారించారు. మెల్‌బోర్న్‌లోని చారిత్రక క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో జరిగిన భారత్–ఆస్ట్రేలియా క్రీడా సంబంధాల వేడుకలో మోదీ పాల్గొన్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, విక్టోరియా ప్రీమియర్ జెసింటా అలన్‌తో కలిసి ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. అక్కడ క్రికెట్, కబడ్డీ, ఆస్ట్రేలియన్ రూల్స్ ఫుట్‌బాల్ ఆడుతున్న యువ క్రీడాకారులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమానికి ఆస్ట్రేలియా క్రీడా దిగ్గజాలైన స్టీవ్ వా, లీసా స్థలేకర్ వంటి వారు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ కలిసి 'భారత్–ఆస్ట్రేలియా క్రీడా సహకార రోడ్‌మ్యాప్'ను ప్రారంభించారు. ఇరు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో క్రీడలు, సాంస్కృతిక మార్పిడి, ప్రజల మధ్య సంబంధాలు కీలక స్తంభాలని ఈ రోడ్‌మ్యాప్ నొక్కి చెబుతోంది. భవిష్యత్ దశాబ్దంలో క్రీడా రంగంలో సహకారానికి అపారమైన అవకాశాలున్నాయని మోదీ అన్నారు. భారత్ 2030లో కామన్వెల్త్ క్రీడలకు, ఆస్ట్రేలియా 2032లో బ్రిస్బేన్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నాయని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో క్రీడలు, సంబంధిత పరిశ్రమలలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడానికి ఇది ఒక సహజమైన అవకాశమని ఆయన వివరించారు. ఇదే సమయంలో ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టుకు మోదీ అభినందనలు తెలిపారు. క్రీడా నైపుణ్యం, యువత భాగస్వామ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి రంగాల్లో కలిసి పనిచేయడానికి గొప్ప అవకాశాలున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

### భారత నౌకాదళంలో సరికొత్త యుద్ధనౌక

# 'మహేంద్రగిరి'

భారత నౌకాదళం అమ్ములపొదిలో చేరిన అత్యాధునిక స్వదేశీ యుద్ధనౌక ఐఎన్ఎస్ మహేంద్ర గిరి చేరిక దేశ రక్షణ రంగంలో సరికొత్త మైలురాయిగా నిలవనుంది. ప్రాజెక్ట్ 17A సిరీస్‌లో భాగంగా నిర్మించిన ఆరో స్టెల్త్ ఫ్రిగేట్ 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి'ని నిర్మించారు. ఈ ఆరో అధునాతన స్టెల్త్ ఫ్రిగేట్‌ను ఇండియన్ నేవీకి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపొందించగా మజ్‌గాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించింది. ఇందులో 75 శాతానికి పైగా స్వదేశీ పరికరాలనే ఉపయోగించారు. శత్రువుల రాడార్ల కంటికి చిక్కకుండా తప్పించుకునే స్టెల్త్ ఫీచర్లు, హై–డిగ్రీ ఆటోమేషన్, గాలిలో, నీటిపై, నీటి లోపల అన్నికోణాల్లో దాడులు చేయగల స్వదేశీ ఆయుధాలు, సెన్సార్స్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్ ఈ నౌక ప్రత్యేకతలు. మహేంద్రగిరి కమీషనింగ్ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నౌకాదళ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. దేశానికి చెందిన 90 శాతానికి పైగా వాణిజ్యం సముద్రం ద్వారానే జరుగుతోందని, అందుకే దేశ ఆర్థిక వృద్ధికి, ఇంధన భద్రతకు సముద్ర రక్షణ అత్యంత కీలకమని చెప్పారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యుద్ధ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు.

# హరీశ్ రావుపై పోటీకి నేను రె'ఢీ'

గత అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి పోటీ చేసి ఓడిన జగ్గారెడ్డి.. ఇక వచ్చే ఎన్నికల్లో నా బదులుగా నా భార్య పోటీ చేస్తుందంటూ ప్రకటించారు. అయితే తాజాగా జగ్గారెడ్డి మీడియా చిట్ చాట్ లో మాట్లాడుతూ గతంలో తను చెప్పిన వ్యాఖ్యలకు భిన్నంగా స్పందించారు. వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గం రిజర్వేషన్ మహిళా, జనరల్ ఏది ఉన్నా కాంగ్రెస్ అభ్యర్థి తన సతీమణి నిర్మలా జగ్గారెడ్డినే అని స్పష్టం చేశారు. అదే సమయంలో అధిష్టానం ఆదేశిస్తే నేను వచ్చే ఎన్నికల్లో మాజీ మంత్రి హరీశ్ రావుపై పోటీ చేసేందుకు సిద్ధమేనని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డిలో తాను పోటీ చేయబోవడం లేదని గతంలో చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. నేను సంగారెడ్డిలో మాత్రమే పోటీ చేయనన్నానని చెప్పానని... కానీ వేరే చోట పోటీ చేయను అనలేదు కదా అని కొత్త ట్విస్టు ఇచ్చారు. నేను ఎక్కడ పోటీ చేయాలో పార్టీ నిర్ణయిస్తుందంటూ పేర్కొన్నారు. రాజకీయాల్లో పర్మినెంట్‌గా ఎవరూ తోపులు ఉండరన్నారు. పెద్ద పెద్ద తోపులను కూడా ప్రజలు ఎన్నికల్లో పక్కన పెట్టేసిన చరిత్రలు ఉన్నాయని, అందుకే సిట్టింగ్ ఎమ్మెల్యే తోపు కాదు సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జీ మాత్రమే తోపులన్నారు. సిటింగ్ ఎమ్మెల్యేలలో కొందరి పనితీరు సరిగా లేదని సీఎం చెప్పారని, వారు పనితీరు మార్చుకోకపోతే, వచ్చే ఎన్నికల టికెట్ ఇవ్వాలో వద్దో సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జి నిర్ణయం తీసుకుంటారని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

### "సియోల్... అంతవరకు

# కమ్సహమ్నిదా"

**సియోల్ (సింగిడి)**

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ తన దక్షిణ కొరియా పర్యటనను విజయవంతంగా ముగించుకున్నారు. వారం రోజుల పాటు సియోల్‌లో జరిగిన ఈ పర్యటనలో రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో పలువురు పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ పర్యటన ముగిసిన సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన పోస్ట్ చేశారు.

"కొరియన్ల స్ఫూర్తితో 'పల్లి పల్లి' (త్వర త్వరగా) పద్ధతిలో చర్చలు, భాగస్వామ్యాలపై దృష్టి సారించాం. భవిష్యత్తుకు సంబంధించిన ఉమ్మడి దార్శనికతతో ఈ పర్యటన సాగింది" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. తన పర్యటన విజయవంతం కావడానికి సహకరించిన దక్షిణ కొరియా విదేశాంగ శాఖ, సియోల్‌లోని భారత రాయబార కార్యాలయం, ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "మళ్లీ కలుద్దాం సియోల్... అంతవరకు కమ్సహమ్నిదా!" అంటూ కొరియన్ భాషలో పోస్ట్‌ను ముగించారు. కమ్సహమ్నిదా అనేది కొరియన్ భాషా పదం. ఎవరికైనా అత్యంత మర్యాదపూర్వకమైన రీతిలో కృతజ్ఞతలు తెలిపేటప్పుడు ఈ పదం (కమ్సహమ్నిదా) ఉపయోగిస్తారు. అన్నట్టు... టాలీవుడ్ మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కొత్త చిత్రం 'కొరియన్ కనకరాజు'లో కూడా 'కమ్సహమ్నిదా' పేరుతో ఓ సాంగ్ ఉంది. ఈ పాట రిలీజైనప్పుడు ఆడియన్స్ నుంచి విశేషమైన స్పందన వచ్చింది.

### సెమీ కండక్టర్ రంగంలో మరో

# కీలక ముందడుగు

టీ–వర్క్స్‌లో ఏర్పాటు చేసిన ఈ హబ్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శనివారం ప్రారంభించారు. జపాన్‌కు చెందిన తోహో కోకి సంస్థ సాంకేతిక సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రాన్ని దేశంలోనే ప్రముఖ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పుకొచ్చారు. జపాన్‌తో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ అత్యాధునిక సెమీకండక్టర్ టెక్నాలజీ అభివృద్ధికి ఈ హబ్ వేదికగా నిలుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. చిప్ తయారీ ప్రక్రియలో అత్యంత కీలకమైన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ ఇకపై హైదరాబాద్‌లో అందుబాటులోకి రావడంతో దేశీయ సెమీకండక్టర్ పరిశ్రమకు ఊతం లభించనుంది. ఈ హబ్ ద్వారా విద్యార్థులు, స్టార్టప్‌లు, పరిశోధకులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణతో పాటు పరిశోధన, ఉత్పత్తి అభివృద్ధికి అవసరమైన సహకారం అందించనున్నారు. ఈ సందర్భంగా వచ్చే 18 నుంచి 24 నెలల్లో దేశీయంగా సీఎంపీ ప్యాడ్ల తయారీని ప్రారంభించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి శీధర్ బాబు తెలిపారు. సెమీకండక్టర్ తయారీకి అవసరమైన కీలక సాంకేతికతలను తెలంగాణలోనే అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పరిశోధన నుంచి నైపుణ్యాభివృద్ధి, ప్రోటోటైపింగ్, చిప్ తయారీ వరకు సమగ్ర సెమీకండక్టర్ ఎకో సిస్టమ్‌ను నిర్మించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని మంత్రి శీధర్ బాబు వెల్లడించారు.

### ఫోక్సో కేసు పెట్టారన్న కక్షతో

# ఆరుగురి దారుణ హత్య

**ఎఫ్ఐఆర్‌లో నిర్ఘాంతపోయే నిజాలు**

అయితే, ప్రధాన నిందితుడైన రాజ్‌కుమార్‌పై నమోదైన పోక్సో ఎఫ్ఐఆర్ కాపీలోని వివరాలు ఇప్పుడు అందరినీ భయాందోళనలకు గురిచేస్తున్నాయి. గత 6 నెలలుగా రాజ్‌కుమార్ సదరు మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. తనతో మాట్లాడాలని, కలవాలంటూ నిరంతరం బలవంతం చేసేవాడని తెలుస్తోంది. శంషాబాద్‌లో కాలేజీకి వెళ్లే సమయంలోనూ రాజ్‌కుమార్ వేధింపులు మితిమీరడంతో, అతడి భయానికి తాళలేక తల్లి ఆ బాలికను కాలేజీకి పంపడం మాన్పించేసింది. ఇటీవల పరీక్షలు ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో తల్లి దగ్గరుండి బాలికను పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లింది. అయితే, పరీక్ష ముగిసిన వెంటనే బాలికను అందరూ చూస్తుండగానే లాక్కెళ్లేందుకు రాజ్‌కుమార్ ప్రయత్నించాడు. 'గతంలో నీ తండ్రిని ఫుల్లుగా తాగించి హార్ట్ ఎటాక్ అని చెప్పి నమ్మించి చంపినట్లే, మిమ్మల్ని కూడా చంపేస్తా' అంటూ రాజ్‌కుమార్ బాలికను, ఆమె తల్లిని తీవ్రంగా హెచ్చరించాడు. దీంతో ప్రాణభయంతో తమను కాపాడాలంటూ బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**ఇది వరకే నిందితుడిపై కేసు నమోదు..**

ఉన్మాది రాజ్‌కుమార్‌కు ఈ కేసే మొదటిది కాదని తెలుస్తోంది. గతంలోనూ ఓ భూతగాదా విషయంలో ఇద్దరు వ్యక్తులను తీవ్రంగా కొట్టి, చంపేస్తానని బెదిరించినట్లుగా అతడిపై ఆరోపణలు ఉన్నాయి. ఇంతటి నేర చరిత్ర ఉన్న వ్యక్తిపై, ఓ తల్లి తన కూతురి ప్రాణాలు కాపాడాలని మొరపెట్టుకున్నా పోలీసులు నామమాత్రంగా స్పందించడం వల్లే ఇవాళ ఆరుగురి ప్రాణాలు పోయాయంటూ మృతుల బంధువులు, గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ షాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించడంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది.

**రాత్రి 11 గంటల నుంచి హత్యలు షురూ.. భార్య, పిల్లలను కూడా**

ఉన్మాది రాజ్‌కుమార్ కేవలం రెండు గంటల వ్యవధిలో సాగించిన నరమేధం ఒళ్లు గగుర్పొడిచేలా చేసింది. రాత్రి 11 గంటల సమయంలో సదరు మైనర్ బాలిక ఇంటికి వెళ్లిన రాజ్‌కుమార్ ఆమె అమ్మతో పాటు నాయనమ్మ అతి దారుణంగా కత్తితో విచాక్షణారహితంగా దాడి చేసి చంపేశాడు. అనంతరం బాలికను బలవంతంగా కారులో 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న దైవాలగూడ చెరువు కట్ట వద్దకు తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడి గొంతు కోసి హతమార్చాడు. అంతటితో ఆగకుండా అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో తన ఇంటికి బయలుదేరుతూనే.. దారిలో భార్యకు ఫోన్ చేసి ఒకే ఒక్కసారి పిల్లలను చూస్తానని చెప్పాడు. ఇంట్లోకి వెళ్లడమే ఆలస్యం భార్యపై కత్తితో దాడి చేయగా, ఆమె ప్రాణభయంతో బయటకు పరుగులు తీసినప్పటికీ వదలకుండా ఈడ్చుకుంటూ లోపలికి లాక్కెళ్లి గొంతు కోసి చంపేశాడు. ఆ తర్వాత నిద్రిస్తున్న తన ఇద్దరు కన్న పిల్లలను సైతం ఏమాత్రం జాలి లేకుండా గొంతు కోసి మట్టుబెట్టాడు. ఇలా కేవలం రెండు గంటల్లో ఆరుగురిని పొట్టనబెట్టుకున్న రాజ్‌కుమార్, వారికి రక్తం ఒడుతున్న కారులోనే అక్కడి నుంచి పరారవుతూ తన తండ్రికి ఫోన్ చేసి 'నేను ఆరుగురిని చంపేశాను' అని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు.

### మధుర గాయని ఎస్.జానకి

# గుండెపోటుతో కన్నుమూత

భారతీయ సినీ సంగీత ప్రపంచంలో తనకంటూ ఒక సువర్ణాధ్యాయాన్ని లిఖించుకున్న ప్రముఖ గాయని, 'దక్షిణ భారత గాన కోకిల'గా ప్రఖ్యాతి గాంచిన ఎస్.జానకి (శిష్ట్లా శ్రీరామమూర్తి జానకి) ఇకలేరు. గత కొంతకాలంగా వయోభారంతో బాధపడుతున్న ఆమె, శనివారం, జూలై 11న కర్ణాటకలోని మైసూరులో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. ఆరు దశాబ్దాల పాటు తన గాన మాధుర్యంతో కోట్లాది మంది సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేసిన జానకమ్మ మరణంతో భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసినట్లయింది. ఆమె మనవరాలు అప్సర వైద్యుల ఈ విషయాన్ని ధ్రువీకరించారు. జానకికి గుండెపోటు రావడంతో ఈ మధ్యాహ్నం 12.49 గంటలకు అపోలో ఆసుపత్రిలో చేర్చారు. అయితే, చికిత్స పొందుతూ రాత్రి 7.30 గంటలకు తుదిశ్వాస విడిచినట్టు ఆసుపత్రి వర్గాలు ప్రత్యేక బులెటిన్ ద్వారా వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో 1938 ఏప్రిల్ 23న శిష్ట్లా శ్రీరామమూర్తి, సత్యవతి దంపతులకు జానకి జన్మించారు. ఆమె తండ్రి ఆయుర్వేద వైద్యుడు, ఉపాధ్యాయుడు. బాల్యం ఎక్కువగా సిరిసిల్లలో గడిచింది. తొమ్మిదేళ్ల వయసులోనే తొలిసారి వేదికపై పాడి తనలోని గాన ప్రతిభను చాటుకున్నారు. మేనమామ సలహాతో మద్రాసు చేరిన ఆమె, ఏవీఎం స్టూడియోస్‌లో సంగీత దర్శకుడు ఆర్. సుదర్శనం వద్ద తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1957లో తమిళ చిత్రం 'విధియిన్ విలైయాట్టు'తో నేపథ్య గాయనిగా అరంగేట్రం చేసిన జానకి, అదే ఏడాది తెలుగులో 'ఎమ్మెల్యే' చిత్రంలో పాడారు. తొలి సంవత్సరంలోనే ఏకంగా ఆరు భాషల్లో పాటలు పాడి అబ్బురపరిచారు. ఆమె ఆరు దశాబ్దాల సుదీర్ఘ సంగీత ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు 20 భారతీయ భాషల్లో, అలాగే ఇంగ్లీష్, జపనీస్, జర్మన్ వంటి విదేశీ భాషల్లోనూ కలిపి 48,000కు పైగా పాటలను రికార్డ్ చేశారు.

## కావాలనే కన్నెపల్లి పంపులు తెరవడం లేదు

సిద్దిపేట జిల్లా పెద్దమ్మ తల్లి రేవంత్ రెడ్డికి సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకున్నట్లు వెల్లడించారు. ఎంతటి కరవు వచ్చినా రైతాంగానికి నీరందించేలా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని, మోటార్లు ఆన్ చేస్తే రంగనాయక సాగర్ నిండి, సిద్దిపేట నియోజకవర్గంలోని దాదాపు 70 నుంచి 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. కాళేశ్వరంతో ఒక్క ఎకరం కూడా పండలేదని వెల్లడించిన ముఖ్యమంత్రి తిమ్మాయిపల్లి గ్రామానికి వచ్చి ప్రజలతో మాట్లాడితే అర్థమవుతుందని అన్నారు. తిమ్మాయిపల్లిలో తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, కాళేశ్వరం జలాల రాకతో ఈ ప్రాంతం బంగారు పంటలతో కళకళలాడుతోందని సంతోషం వ్యక్తం చేశారు.ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు నర్మెట ఫ్యాక్టరీ ద్వారా అద్భుతమైన ఆదాయం లభిస్తోందని తెలిపారు.

## బుల్లెట్ ట్రైన్ హబ్‌గా తెలంగాణ

ఈ విప్లవాత్మక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయాలు ఊహించని విధంగా తగ్గిపోతాయన్నారు. ముఖ్యంగా, హైదరాబాద్ నగరవాసులకు ఈ రైళ్లతో ప్రయాణ కష్టాలు పూర్తిగా తీరిపోనున్నాయి. బుల్లెట్ రైలు ఎక్కితే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం ఒక గంట పది నిమిషాల్లోనే చేరుకోవచ్చని రైల్వే మంత్రి వివరించారు. అలాగే వ్యాపార రాజధాని ముంబైకి రెండు గంటల ఇరవై నిమిషాలు, అటు చెన్నై నగరానికి కేవలం రెండు గంటల్లోనే దూసుకుపోవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ దేశ రవాణా రంగంలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఇదే గ్యాప్‌లో ఈ ప్రాజెక్టుల క్రెడిట్ కోసం కొందరు పాకులాడుతున్నారంటూ విపక్షాలపై మంత్రి మండిపడ్డారు. దీని పూర్తి క్రెడిట్ ప్రధాని మోదీకే దక్కుతుందని, గత యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో కేవలం రూ. 800 కోట్లు మాత్రమే ఇస్తే, తమ ప్రభుత్వం ఒక్క తెలంగాణకే ఏకంగా రూ. 5000 కోట్ల రైల్వే నిధులు కేటాయించిందని గుర్తుచేశారు.

### నన్ను చంపితే.. ఇరాన్

# ఉనికి మాయమే: ట్రంప్

ఈ మేరకు ట్రూత్‌లో పోస్ట్‌పెట్టారు. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేయడానికి ఇరాన్ ఇటీవల ఒక ప్రణాళికను రూపొందించిందని హెచ్చరిస్తూ ఇజ్రాయెల్ అమెరికాతో పంచుకున్నట్లు ఓ నివేదిక బయటకు రావడం కలకలం రేపింది. అయితే ఇరాన్‌పై దాడులను తీవ్రతరం చేయాలా వద్దా అని ట్రంప్ ఆలోచిస్తున్న తరుణంలో ఆయన నిర్ణయాలను ప్రభావితం చేయడానికి ఇజ్రాయెల్ ఇలాంటి నివేదికలతో ప్రయత్నిస్తోందని అమెరికా అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకే ఇజ్రాయెల్ నివేదికను అమెరికా సీరియస్ తీసుకోవడం లేదని ఆ దేశా నిఘా సంస్థ పేర్కొంది.లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్యకు గాను ట్రంప్, నెతన్యాహుపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అలాగే అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం ప్రయత్నాలను ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహు అసంతృప్తిగా ఉన్న సంగతి తెలిసిందే.

**ఇరాన్ అంతు చూస్తాం..అందుకు ఆదేశాలిచ్చాను : ట్రంప్**

ఇదిఇలా ఉండగానే తన హత్యకు కుట్ర ప్రచారంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఒకవేళ ఇరాన్ నన్ను హత్య చేయాలని ప్రయత్నిస్తే.. 1000 క్షిపణులు ఒక్కసారిగా విరుచుకుపడతాయని హెచ్చరించారు. ఈ మేరకు ట్రూత్‌లో పోస్ట్‌పెట్టారు. అందుకు సంబంధించి ఇప్పటికే తన సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు.ఇరాన్ అంతు చూస్తామని హెచ్చరించారు.అయితే టెహ్రాన్ నన్ను చంపడంలో విఫలమవుతుందని ఆశిస్తున్నానని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. అమెరికా–ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినప్పటికీ..రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఏమాత్రం సమసిపోలేదు. రెండుదేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. హర్మూజ్ జలసంధిపై పట్టు కోసం ఇరాన్ ప్రయత్నిస్తుండటంపై అమెరికా ఆగ్రహంతో ఉంది. నౌకలపై దాడులు ఆపడంతో పాటు శాంతి ఒప్పందంపై ముందుకు వచ్చే విషయమై ఇరాన్‌కు 24గంటల సమయం ఇస్తున్నట్లుగా తాజాగా ట్రంప్ ప్రకటించారు.

### పవన్‌కు ముంబైలో

# 3 గంటల పాటు సర్జరీ

పవన్ కు శస్త్ర చికిత్స విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు నాయుడు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పూర్తి స్థాయిలో, అత్యంత వేగంగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## మా మీద కక్షతో రైతుల నోట్లో మట్టి కొట్టకు

ప్రస్తుతం తెలంగాణలో ఏర్పడుతున్న కరువు కాలం తెచ్చిన కరువు కాదు అని..ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు అని ఆరోపించారు. ఒకవైపు నీళ్లు లేక రైతులు ఏడుస్తుంటే.. రేవంత్ రెడ్డి ఏమో గోదావరిలో నీళ్లున్నా మా మీద కోపంతో నీళ్లు ఉన్నా కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఎక్కడా నీళ్లు లేకపోయినా కన్నెపల్లిలో మాత్రం నీళ్లు ఉన్నాయని, 2022 వరదల ఫోటోలు చూపి కన్నెపల్లి మునిగిందని అడ్డమైన మాటలు మాట్లాడుతున్నారని తప్పుబట్టారు.

**నీటి నిల్వ చేయకుండానే ఎత్తిపోయవచ్చు...**

మేడిగడ్డను ముట్టకుండా కన్నెపల్లి నుండి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు అన్ని జలాశయాలు నింపొచ్చు అని, రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక చూసి అయినా రేవంత్ రెడ్డి సోయి తెచ్చుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు అని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిందని గుర్తు చేశారు. కన్నెపల్లి వద్ద ప్రస్తుతం 96.79 మీటర్ల నీళ్లు ప్రవహిస్తున్నాయి, కానీ 94 మీటర్లకే పంపులు ఆన్ చేయవచ్చు అని, మరో 100 రోజులు కన్నెపల్లి వద్ద ఇదే తరహా ప్రవాహం ఉంటుందన్నారు. 100 రోజుల్లో రోజుకి 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల లిఫ్ట్ చేస్తే, గోదావరి బేసిన్లో ఉన్న అన్ని రిజర్వాయర్లు నింపి సస్యశ్యామలం చేసే అవకాశం ఉందని ప్రభుత్వానికి రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిందని వెల్లడించారు. మేడిగడ్డ గేట్లు దించితే భద్రాచలం రాముడు మునిగిపోతాడు అని రేవంత్ రెడ్డి అంటున్నాడని, 2022లో గోదావరిలో 15 రోజులు వరసగా దాదాపు 28లక్షల 50,000 క్యూసెక్కుల వరద వచ్చినా మేడిగడ్డ తట్టుకొని నిలబడిందని, ఇప్పుడు కేవలం లక్ష క్యూసెక్కులు మాత్రమే వస్తుందని, ఇప్పుడు ఎందుకు తట్టుకోదు? అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి పైసలు ఎత్తిపోయడం బాగా తెలుసు, నీళ్లు ఎత్తిపోయడం తెలవదని, ఢిల్లీకి సంచులు మోయడం తెలుసు, కానీ ధాన్యం సంచులు నింపడం తెలవదు అని ఎద్దేవా చేశారు.

# ఓటిటి సినిమాకూ సెన్సార్ షిప్

### తాజా పరిణామాలతో కేంద్రం యోచన

**న్యూఢిల్లీ, జులై 11 (సింగిడి)**

భారతదేశంలో నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, డిస్నీ హాట్‌స్టార్ వంటి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో వచ్చే సినిమాలు, వెబ్ సిరీస్‌లపై కేంద్ర ప్రభుత్వం నిఘా పెంచాలని చూస్తుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న సమాచార సాంకేతిక రూల్స్, 2021 స్థానంలో సరికొత్త కఠిన నిబంధనలను తీసుకురావడానికి కసరత్తులు జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుత విధానం ప్రకారం, ఓటీటీ కంటెంట్‌ను థియేటర్లలో విడుదలయ్యే సినిమాల మాదిరిగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ముందస్తుగా పరిశీలించి ఎటువంటి సర్టిఫికేట్ ఇవ్వదు. ఇదంతా ఐటీ రూల్స్, 2021 పరిధిలోని డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్ ప్రకారమే నడుస్తోంది. దీనివల్ల ఆయా ప్లాట్‌ఫామ్‌లు తమ కంటెంట్‌ను వయస్సు ఆధారంగా విభజించి, కేవలం స్వీయ నియంత్రణ మాత్రమే పాటిస్తున్నాయి. అయితే, ఇటీవల కొన్ని ఓటీటీ సినిమాలు, వెబ్ సిరీస్‌లలో మితిమీరిన బోల్డ్ సీన్లు, బూతులు మరియు వివాదాస్పద రాజకీయ, సామాజికాంశాలు ఎక్కువవుతున్నాయనే ఫిర్యాదులు ప్రభుత్వానికి పెద్ద ఎత్తున అందాయి. తాజా ఉదాహరణగా, పంజాబీ నటుడు దిల్జీత్ దోసాంజ్ నటించిన 'సత్లుజ్' సినిమా నిలిచింది. ఈ చిత్రం థియేట్రికల్ విడుదల కోసం సెన్సార్ బోర్డ్ వద్దకు వెళ్లినప్పుడు ఏకంగా 120కి పైగా కట్స్ చెప్పారు. అందుకు నిర్మాతలు నిరాకరించి, నేరుగా ఓటీటీ వేదికపై విడుదల చేసినప్పటికీ, వివాదం రేగడంతో కేవలం 48 గంటల్లోనే ఆ సినిమాను తొలగించాల్సి వచ్చింది. ఇలాంటి ఘటనల నేపథ్యంలోనే, థియేటర్ల కోసం కాకుండా నేరుగా డిజిటల్ వేదికలపై వచ్చే కంటెంట్‌కు కూడా ముందస్తు పర్యవేక్షణ ఉండాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే ఓటీటీలో నేరుగా విడుదలయ్యే చిత్రాలకు కూడా సెన్సార్ సర్టిఫికేషన్ తప్పనిసరి చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. కేవలం సినిమాలకే కాకుండా, ఓటీటీ వెబ్ సిరీస్‌లను కూడా ఈ సెన్సార్ పరిధిలోకి తీసుకురావాలా లేదా అనే అంశంపై వివిధ వర్గాలతో మరియు ఐటీ శాఖతో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ప్రస్తుతం కీలక చర్చలు జరుపుతోంది. ఒకవేళ ఈ నిబంధనలు కనుక అమల్లోకి వస్తే, డిజిటల్ కంటెంట్ క్రియేటర్ల సృజనాత్మక స్వేచ్ఛపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

### తిరుపతిలో మల్లారెడ్డి

# డీమ్డ్ యూనివర్సిటీ

**తిరుపతి, జులై 11 (సింగిడి)**

తెలంగాణకు చెందిన ప్రముఖ విద్యావేత్త, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి.. ఏపీలో తన విద్యాసంస్థల సామ్రాజ్యాన్ని విస్తరించే దిశగా కీలక అడుగు వేశారు. తిరుపతిలో 'మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించారు. ఈ వర్సిటీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు లభించాయని తిరుమలలో వెల్లడించారు. నిన్న ఉదయం శ్రీవాణి ట్రస్ట్ దాతగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. గత 35 ఏళ్లుగా విద్యా రంగంలో సేవలు అందిస్తున్నానని, తిరుపతిలో యూనివర్సిటీ స్థాపించాలన్న తన చిరకాల కల నెరవేరిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. 2025లోనే ఈ ఆలోచన చేశానని, శ్రీవారి దయతో ఇప్పుడు అది కార్యరూపం దాల్చిందని తెలిపారు. తెలంగాణలో ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు, డీమ్డ్ యూనివర్సిటీలతో బలమైన నెట్‌వర్క్‌ను నిర్మించుకున్న మల్లారెడ్డి, ఇప్పుడు ఇతర రాష్ట్రాలపైనా దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఆయన గతేడాది తిరుపతిలో ఒక ఇంజనీరింగ్ కళాశాలను కొనుగోలు చేశారు. అదే ఏడాది నవంబర్‌లో విశాఖపట్నంలోనూ మరో కళాశాలను కొనుగోలు చేసినట్లు గతంలోనే వెల్లడించారు. శ్రీవారి ఆశీస్సులతో దేశవ్యాప్తంగా విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలన్నది తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. పాల వ్యాపారంతో జీవితం ప్రారంభించి, విద్యావేత్తగా, రాజకీయ నాయకుడిగా ఉన్నత స్థాయికి ఎదిగిన మల్లారెడ్డి, ఇప్పుడు తన 'మల్లారెడ్డి' బ్రాండ్‌ను ఏపీకి విస్తరిస్తున్నారు. అయితే, గతేడాది కొనుగోలు చేసిన కాలేజీ ప్రాంగణంలోనే ఈ డీమ్డ్ వర్సిటీని అభివృద్ధి చేస్తారా? లేక కొత్త ప్రాంగణాన్ని ఎంచుకుంటారా? అనే దానిపై రానున్న రోజుల్లో స్పష్టత రానుంది.

# వియత్నాంలో ఘోర విషాదం

**కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు!**

ఈ ప్రమాదంపై సమాచారం, సహాయం అందించేందుకు అధికారులు కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు చేశారు. హనోయిలోని భారత రాయబార కార్యాలయంతోపాటు హో చి మిన్ సిటీలోని భారత కాన్సులేట్ జనరల్ ఆఫీస్‌లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా లేదా సహాయం అవసరమైనా తమను సంప్రదించవచ్చని భారత దౌత్య కార్యాలయం హెల్ప్‌లైన్ నెంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది.

**సహాయం కోసం డయల్ చేయాల్సిన హెల్ప్‌లైన్ నెంబర్లు**

+84 36 281 7930
+84 91 552 37 14
+84 33 452 0414
+84 91 308 9165

**గతేడాది హాలాంగ్ బేలో ప్రమాదం**

వియత్నాంలో సరిగ్గా ఏడాది క్రితం ఇలాంటి పడవ ప్రమాదమే ఒకటి జరిగింది. 2025 జులైలో వియత్నాంలోని అత్యంత ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన హాలాంగ్ బేలో భారీ ప్రమాదం సంభవించింది. 48 మంది పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక బోటు తుపాను వల్ల వచ్చిన బలమైన గాలులతో సముద్రంలో మునిగిపోయింది. ఆ ప్రమాదంలో 20 మంది పిల్లలతో సహా మొత్తం 35 మంది పర్యాటకులు ప్రాణాలు చనిపోయారు. ఈ ఘటన గతేడాది ప్రపంచ వ్యాప్తంగా సంచలనంగా మారింది. హాలాంగ్ బే ప్రమాదం వియత్నాం దేశంలో పర్యాటక బోట్ల భద్రతా ప్రమాణాలపై అంతర్జాతీయంగా తీవ్ర చర్చకు



దారితీసింది. ఆ ఘటన జరిగి ఏడాది గడవక ముందే, ఇప్పుడు మళ్లీ ఫు క్వాక్ ద్వీపం వద్ద భారత పర్యాటకులతో వెళ్తున్న బోటు ప్రమాదానికి గురికావడం వల్ల పర్యాటకులు మళ్లీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం 12-7-2026



# జేఎన్‌టీయూ విద్యార్థులకు అత్యాధునిక రవాణా సౌకర్యం

## ఇంజనీరింగ్ కళాశాలకు కొత్త బస్సులను ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ

**సంగారెడ్డి బ్యూరో, జూలై 11 (సింగిడి):** చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నూతన బస్సులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన స్మార్ట్ కంప్యూటర్ ల్యాబ్‌ను కూడా మంత్రి ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు సురక్షితమైన రవాణా సౌకర్యాలు, ఆధునిక మౌలిక వసతులు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత నిస్తుందని అన్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కళాశాలలకు రాకపోకలు సాగించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. జేఎన్‌టీయూ పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతనంగా రెండు బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మంత్రి తెలిపారు. దీంతో విద్యార్థుల రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారడంతో విద్యార్థుల సమయం వృధా కాకుండా, సమయపాలన మెరు గవుతుందన్నారు. విద్యార్థులకు ఈ బస్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. అలాగే, డిజిటల్ విద్యకు ప్రాధాన్యం ఇస్తూ ఏర్పాటు చేసిన స్మార్ట్ కంప్యూటర్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకునే అవకాశం లభిస్తుందని, ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇది దోహదపడుతుందని మంత్రి తెలిపారు.



ప్రపంచ స్థాయి సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యాసంస్థల్లో అవసరమైన అన్ని సదుపాయాలను దశలవారీగా కల్పిస్తోందన్నారు. విద్యార్థులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ హెచ్ వైస్ ఛాన్సలర్ డా. కిషన్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు , కళాశాల ప్రిన్సిపల్ విశ్వనాథరాజు,అందోల్ ఆర్డీఓ రమేష్ బాబు , ప్రజాప్రతినిధులు, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, తాఫితరులు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్






**కుత్బుల్లాపూర్, జులై 11 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 129 సూరారం డివిజన్ టీఎస్ఐఐసీ కాలనీ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నందు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) కార్యక్రమంపై బీఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే శ్రీ కేపీ. వివేకానంద్ అధికారులు, బిఎల్ఓ, బిఎల్ఏ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి అర్హులైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం, అనర్హుల పేర్లు తొలగించడం, మార్పులు--చేర్పులు పారదర్శకంగా నిర్వహించడం ఎన్నికల సంఘం బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజాప్రతినిధులుగా (ఎస్ ఐ ఆర్) పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, ప్రతి అర్హుడైన ఓటరు నమోదు అయ్యేలా చూడడం మనందరి బాధ్యత అని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ( బి ఎల్ ఓ )లు ఎన్నికల సిబ్బంది, బిఎల్ఏ ( బి ఎల్ ఏ )లు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా దరఖాస్తులను స్వీకరించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి (సర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా యువ ఓటర్లు, మహిళలు, కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అర్హులైన వారందరూ తప్పనిసరిగా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే నమోదైన వారు తమ వివరాలను ఒకసారి పరిశీలించి అవసరమైతే సవరణలు చేయించు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని రాజకీయాలకు అతీతంగా, పూర్తిగా ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించే విధంగా నిర్వహించి ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు బిఎల్ఎ, బిఎల్ఓ, సంక్షేమ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటే ప్రజాస్వామ్యానికి... విలువైన సంపద

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు

**జవహర్ నగర్, జూలై 11 (సింగిడి):** ఓటే ప్రజాస్వామ్యానికి విలువైన సంపదని డిఎస్ఎస్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్ర గుడ్ల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ పరిధిలోని నాచారం ఫైర్ఫైటింగ్ కాలనీలో స్పెషల్ ఎంటెన్సీ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాచారం ఫైర్ఫైటింగ్ కాలనీలో శనివారం ఓటర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయకులు ఎర్ర గుడ్ల వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ జవహర్ నగర్ లో అర్హులందరూ ఓటు హక్కును కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్ల



పద్మారావు, నాగేష్ రజక, అంద నరేందర్, మామిడిపల్లి సాయి, పరమేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికత, సంప్రదాయాలు మన సంస్కృతికి మూలస్తంభాలు

## బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, జులై 11 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 132 జీడిమెట్ల డివిజన్ అంగడి పేటలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బొడ్రాయి అనేది గ్రామానికి ఆధ్యాత్మిక రక్షణ కల్పించే పవిత్ర చిహ్నమని, గ్రామ ఐక్యతకు, శాంతి, సౌభాగ్యాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మన పూర్వీకుల సంప్రదాయాలను, భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామాల్లో జరిగే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తాయని, సమాజంలో సానుకూల వాతావరణాన్ని నెలకొల్పుతాయని తెలిపారు. గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో ఉండాలని



ఆకాంక్షిస్తూ అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పేట్ బషీరాబాద్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా విద్యార్థుల ప్రమాణ స్వీకారోత్సవం





**అల్వాల్, జూలై 11(సింగిడి):** అల్వాల్ సూర్య నగర్ లోని సెయింట్ ఆల్ఫో స్పేస్ హై స్కూల్‌లో ప్రమాణస్వీకారం ఉత్సవం అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులు అందరూ అర్థం చేసుకునేలామనిషికి కావాల్సిన ఉత్తమ వ్యక్తిత్వవికాసం క్రమశిక్షణ వేలువెత్తుల ఇతరులకు ఆదర్శంగా ఉండాలని ముఖ్య అతిథి గాంధీనగర్ సబ్ ఇన్స్పెక్టర్ కె.వి రంగారావు పేర్కొన్నారు. ప్రమాణ స్వీకారోత్సవ అనంతరం విద్యార్థి నాయకులకు నాయక పథకాలని బహుకరించి ప్రోత్సహించారు. స్కూల్ యజమాన్యం మాస్ డ్రిల్. దేశభక్తి జీతాలతో చూప చూపరులను అందరినిఅలరించింది. ప్రతకాలను అందజేసిన ముఖ్యఅతిథి కె.వి.రంగారావు పథకాలు అందుకున్న విద్యార్థి విద్యార్థులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత కటారి అజయ్ కుమార్, పాఠశాల కరస్పాండెంట్ జరాడ్ సామెల్, ఉపాధ్యాయులు చంద్రమోహన్, సతీష్, జనార్ధన్, లక్ష్మణ్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు. వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**వికారాబాద్, జూలై 11(సింగిడి):** పరిగి పట్టణంలో రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి, సంకల్పంతో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అన్ని సామాజిక వర్గాల ఒకేచోట విద్యను అందించాలనే లక్ష్యంతోప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మిస్తుంది . విద్యతో పాటు ఆటలు , టెక్నాలజీని అందిపుచ్చుకునేలా వసతులు ఉంటాయని ఎమ్మెల్యే గారు తెలిపారు. పరిగిలో నిర్మాణంలో ఉన్న ఈ పాఠశాల పనులను వేగంగా పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరంలోనే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఏ సీ ఎస్ చైర్మన్ పార్థసారథి పంతులు, మున్సిపల్ చైర్మన్ రంజిత వెంకటేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్, పి ఏ సీ ఎస్ వైస్ చైర్మన్ రాజపుల్లారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, పరిగి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రాములు, కౌన్సిలర్ అఖిల, బాదం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సబ్ రిజిస్టర్ ఆఫీసుకు కృషి చేయండి

## మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి

**అల్వాల్, జూలై 11(సింగిడి):** సబ్ రిజిస్టర్ ఆఫీస్ అల్వాల్ ప్రాంతంలో లేనందున ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ప్రజల అవసరాల దృశ్య అల్వాల్ ప్రాంతంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి అధికారులను కోరారు. మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశానుసారం మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ అసిస్టెంట్ ఇంజనీర్ స్ఫూర్తి. డిస్టిక్ రిజిస్టర్ ఆఫీసర్లతో కలిసి గవర్నమెంట్ ఆధీనంలో ఉన్న బాలసదన్ భవనమునుపరిశీలించారు. అల్వాల్ సబ్ రిజిస్టర్ కార్యాలయము ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత దగ్గరగా చేయడమే లక్ష్యంగా కొనసాగుతాయని మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.



# అంత్యక్రియలకు కాలనీవాసుల ఆర్థిక సాయం

**కొడంగల్, జులై 11(సింగిడి):** కొడంగల్ మున్సిపల్ లోని 12వ వార్డు సభ్యుడు అకాలమరణం చెందడంతో మృతుని కుటుంబ దీనస్థితిని చూసిన కాలనీ వాసులు మృతుని అంత్యక్రియలకు గాను ఆర్థిక సాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుని అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించడం చాలా సంతోషంగా ఉందని కాలనీ వాసులు పేర్కొన్నారు. ఆర్థిక స్థోమత లేని కుటుంబాలలో చిన్న పెద్ద కార్యక్రమాలకు ఈవిధంగా తలో చేయి వేసి అండగా నిలిస్తే ఎవరి ఆసరా కోసం ఎదురు చూడాల్సినపని ఉండదని తెలిపారు. ఆర్థిక సాయం అందించిన కాలనీ వాసులలో రమేష్‌బాబు, కృష్ణంరాజు, వెంకటయ్య, కొండయ్య, రాములు,దస్తప్ప, అశోక్, సాయినాథ్, మాతా రమాబాయి కమిటీ సభ్యురాళ్ళు తదితరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత



**కుత్బుల్లాపూర్, జూలై 11 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, చికిత్స ఖర్చులకు సరిపడా ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. శనివారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు. అందులో భాగంగా సనది సోనీ కి 60వేలు, పెంతోట వెంకటేశ్వర్ల కు 37వేల 500లు,బొండాడ రాజు కు రూ60వేలు, మరోజు పద్మ కు 41వేలు, జులా స్రవంతి కి - రూ 60వేలు మంజూరు కావడంతో సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను కొలను హనుమంత రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, డీసీసీ ఉపాధ్యక్షులు బుయ్యని శివ కుమార్, డీసీసీ సెక్రటరీ కమిటీ సభ్యులు ఎండి లాయక్, గణేష్, 285 డివిజన్ అధ్యక్షులు గడ్డం స్వాతిక రాజేందర్ రెడ్డి, 277 డివిజన్ అధ్యక్షులు సంజీవ రెడ్డి, 296 డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 13న ఉచిత కంటి వైద్య శిబిరం

**ఆమనగల్లు, జూలై 11(సింగిడి):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఈనెల 13న రాంరెడ్డి లయన్ ఐ హాస్పిటల్ విజన్ సెంటర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఈ కేంద్రంలో నిపుణులైన వైద్యులు పరీక్షలు చేస్తారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పి. ఆర్. ఓ ఎం.ఏ పాషా కోరారు. పరీక్షలకు హాజరయ్యే వారు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు మరియు ఫోన్ నంబర్‌ను వెంట తీసుకురావాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించే ఈ గొప్ప కార్యక్రమానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.



## ఓటర్ల కోసం ఆమనగల్లులో

# ప్రత్యేక హెల్ప్ డెస్క్!

### ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

### సయ్యద్ ఖలీల్



**ఆమనగల్లు, జులై 11 (సింగిడి):** ఆమనగల్లు పట్టణంలోని జలాలుద్దీన్ వలియా దర్గా వద్ద ఏర్పాటు చేసిన ఓటర్ల హెల్ప్ డెస్క్ ప్రజల నుండి అద్భుతమైన స్పందన పొందుతోంది. మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఈ వేదిక, ఓటర్ల సందేహాలను తీరుస్తూ ప్రజాస్వామ్య బాధ్యతను గుర్తు చేస్తోంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లకు అవసరమైన సమాచారం అందించి, ఓటరు జాబితా సంబంధిత సందేహాలను నివృత్తి చేసేందుకు ఎస్ఐఆర్ (సర్ ) హెల్ప్ డెస్క్"ను ఏర్పాటు చేశామని వారు తెలిపారు. 2002 ఓటరు జాబితాను పరిశీలించేందుకు, ఎన్యుమరేషన్ ఫారాలను ఎలా నింపాలి,అవసరమైన పత్రాలు ఏమిటి వంటి అంశాలపై ఓటర్లకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నారు. ఓటర్ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ బృందాలను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. సర్ హెల్ప్ డెస్క్ ఆమనగల్లులో రెండు రోజులు నిర్వహిస్తున్నట్లు,తొలి రోజు సుమారు 250 మంది ఓటర్లు హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఓటరు జాబితా పరిశీలన, ఎన్యుమరేషన్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై వారికి అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నట్లు వారు వివరించారు. ఓటర్ల హక్కులను కాపాడటమే లక్ష్యంగా సాగుతున్న ఈ సేవలు సమాజానికి ఎంతో స్ఫూర్తినిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహబూబ్ ఖురేషి, హైమద్, అజీమ్, ఫారుక్, అబ్దుల్ హాఫీజ్, షర్ఫుద్దీన్, బాబా, నయూమ్, జిలాని మియా, మూస , ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

**సిద్ధిపేట బ్యూరో, జూలై 11(సింగిడి):** ఈ నెల 12, 13న ఢిల్లీలో జరిగే ఏ ఐ పి ఎస్ యు కేంద్ర కమిటీ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుండి బయలు దేరినట్లు రాష్ట్ర కార్యదర్శి మన్నే కుమార్ శనివారం రోజున పత్రికా ప్రకటనలో తెలిపారు .విద్యారంగ సమస్యలపై భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు సమావేశాల్లో రూపకల్పన చేయబడుతుందన్నారు. దేశంలో విద్యారంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. విద్యను ప్రజల హక్కుగా కాకుండా మార్కెట్ వస్తువుగా మార్చే నూతన జాతీయ విద్యా విధానం ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ప్రతి విద్యార్థికి శాస్త్రీయ, లౌకిక, ప్రజాస్వామిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఉపాధి ఆధారిత విద్యా విధానాన్ని అమలు చేయాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 10 శాతం నిధులు కేటాయించినప్పుడే ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాల యాలను పరిరక్షించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కేంద్ర కమిటీ సమావేశాల్లో గత కాలంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన ఉద్యమాలు, కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ విద్య పరిరక్షణ, విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేక పోరాటం, విద్యార్థుల హక్కుల సాధన వంటి అంశాలపై దేశవ్యాప్త ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు




తెలిపారు. ప్రభుత్వ విద్య పరిరక్షణ, నూతన జాతీయ విద్యా విధానం రద్దు, విద్యా రంగానికి కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధుల కేటాయింపు, విద్యా సంస్థల్లో ఖాళీ పోస్టుల భర్తీ, ప్రతి విద్యార్థికి సమాన విద్యా అవకాశాల కల్పన వంటి డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా విస్తృత ఉద్యమాలను చేపట్టాలని ఈ సమావేశాల్లో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బోడ. అనిల్, రాష్ట్ర నాయకులు రాజు, గోపాల్ సింగ్ ఠాకూర్, స్వామి పాల్గొంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలను జాతీయ స్థాయిలో ప్రస్తావించి, వాటి పరిష్కారానికి కేంద్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

# సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

**కుత్బుల్లాపూర్, జూలై 11 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ మహాదేవపురం కాలనీలో అంతర్గత రోడ్ల అభివృద్ధిలో భాగంగా సుమారు 37 లక్షల రూపాయల సి సి రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాదేవపురం డివిజన్ లోగల అన్ని కాలనీలు, బస్తీలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, డివిజన్ లో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేపించి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం



జనరల్ సెక్రెటరీ ప్రసాద్ దుగ్యాల, ఉపాధ్యక్షులు రంగారావు, జగదీశ్వర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్, కమిటీ సభ్యులు మహేశ్వర్ రెడ్డి, దిలీప్ కుమార్, మల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి, యాదగిరి చారి, నవీన్ కుమార్, వెంకట్ రెడ్డి తోపాటు కాలనీవాసులు, పలు కాలనీలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

Editorial

## రేవంత్ ఆలోచనకు తగ్గట్లుగా
# ఫ్యూచర్ సిటీ కదిలేనా

రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లు దాటింది. ఇక రేవంత్ రెడ్డికి ఉన్నది కేవలం రెండేళ్ల కాలం మాత్రమే. ఈ రెండేళ్లలో ఆయన అనుకున్న పనులు నెరవేరుస్తారా అన్నది అనుమానమే. ఎందుకంటే ఈ రెండున్నరేళ్లలో గట్టిగా ఒక నిర్మాణాత్మక పనికూడా చేపట్టలేదు. ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయాలేదు. ఎందుకంటే కేవలం సంక్షేమాలతో నెట్టుకు వస్తున్నారు. రేషన్ కార్డులు పెంచడం, సన్నబియ్యం ఇవ్వడం, రైతు భరోసా వేయడం వంటివన్నీ అభివృద్ధి కిందకు రావు. ఈ క్రమంలో ఆయన పెద్ద పనిని తలన పెట్టుకున్నారు. అదే ఫ్యూచర్ సిటీ. ఇప్పుడున్న హైదరాబాద్ ఇంతగా పెరగడానికి కొన్ని దశాబ్దాలు పట్టింది. మెల్లాగా ఇది అల్లుకుంటూ పోవడం వల్ల పెరిగందే తప్ప రాత్రికి రాత్రి పెరగలేదు. చంద్రబాబు సైబరాబాద్‌కు బీజం వేసినా, ఇవాళ ఓఆర్ఆర్ వరకు నగరం విస్తరించడానికి దాదాపు రెండున్నర దశాబ్దాల కాలం పట్టింది. అందువల్ల ఒక సిటీని కట్టాలంటే అనుకున్నంత ఈజీగా అమాంతంగా కట్టలేం. అమరావతి కోసం నిధులు ఉండీ చంద్రబాబు నానా తంటాలు పడుతున్నారు. మధ్యలో జగన్ మావిగన్ అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. అమరావతి ఇప్పట్లో పూర్తి అయ్యేలా లేదు. పోలవరం కట్టడానికి దాదాపు 15 ఏళ్లు పట్టింది. నిధులు ఉండీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తే ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగవచ్చు. కానీ ఫ్యూచర్ సిటీ కోసం రూపాయి కూడా వెచ్చించడానికి లేదు. నిధుల లేమి రాష్ట్రాన్ని పట్టి పీడిస్తోంది. అక్కడ భూములు సేకరించి ఉన్నాయి కనుక ఫ్యూచర్ సిటీ కట్టేయలేం. కొన్ని కార్యాలయాలు తరలించినా, కొందరికి భూములు కేటాయించినా ఇది సాధ్యం అయ్యే పనికాదు. దీనికి తోడు కేవలం రెండంటే రెండేళ్ల కాలం మాత్రమే ఉంది. ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, నెట్ జీరో తరహాలో రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో ఎలాంటి రాజీ పడొద్దని కూడా చెప్పారు. ఈ మేరకు ప్రపంచస్థాయి నగరాలను అధ్యయనం చేసి ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. ఇప్పటికే అక్కడ ఓ ఈవెంట్ నిర్వహించి, పెట్టుబడిదారులను ఆహ్వానించినా, అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకుండా ఎలా అడుగు వేస్తారో అధికారుకలకు కూడా అర్థం కాదు. ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటు అంశాలపై ఎన్ని ఆదేశాలు జారీ చేసినా నిర్దిష్ట ప్రణాళిక మేరకు ముందుకు సాగాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టుల కోసం 500 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. మౌలిక సదుపాయాల నిర్మాణం తర్వాతే భూ కేటాయింపులు జరపాలన్నారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకువచ్చేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను కూడా తీసుకొద్దామని, అవసరమైతే ప్రధాని నరేంద్రమోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామన్నారు. జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమల నిర్మాణం ప్రారంభించేలా నిబంధనలు రూపొందించాలన్నారు. పెట్టుబడులను ఆకర్షించటం కోసం 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని, దీనికి లోగో, వెబ్‌సైట్ రూపొందిం చాలని ఆదేశించారు. పెట్టుబడులకు ముందుకొచ్చేవారికి ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను తీసుకురావాలని, గ్రూప్–1 స్థాయి అధికారులను నియమించాలన్నారు. ఇవన్నీ బాగానే ఉన్నా, అక్కడ మౌలిక వసతులు, ముఖ్యంగా రోడ్లు, నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను పెద్ద ఎత్తున చేపట్టాల్సి ఉంటుంది. బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టు కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినా, అందుకు కేంద్రం త్వరగా నిధులు విడుదల చేయాల్సి ఉంది. 1500 ఎకరాల్లో డేటా సిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఫ్యూచర్ సిటీ దేనికి ప్రాధాన్యం అన్నది కూడా ముఖ్యమే. ఇప్పటికిప్పుడు అక్కడికి వెళ్లి ఉండలేం. అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకుండా ఎవ్వరు కూడా ఉండలేరు. ఇది ఓరకంగా చెప్పాలంటే త్రిశంకు స్వర్గాన్ని సృష్టించడమే అవుతుంది. 2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రకటించారు. బహుశా ఇదే ధీమాతో మరో పదేళ్లకు దీని గురించి ప్లాన్ వేసుకున్నారా అన్నది తెలియదు. ఒకవేళ సిఎం రేవంత్ రెడ్డిని ప్రజలు మరోమారు గెలిపించక పోతే ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ ఏంటన్నది ప్రశ్నార్థకం. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఎవరు సిఎం అన్నది అప్పుడే నిర్ణయిస్తారు. ఒక్క వైఎస్ విషయంలో మాత్రమే రెండో ఆలోచన లేకుండా ఆయనను సిఎం చేశారు. అధిష్ఠానం ఎవరిని నిర్ణయిస్తే వారే ముఖ్యమంత్రి అని ప్రకటించడం కాంగ్రెస్ ఆనవాయితీ. దీనికి భిన్నంగా, వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్నారు. ఆయన చేసిన ఈ ప్రకటన కొంతమంది కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడకపోవచ్చు. అయితే తనకు తాను ఇలా ప్రకటించుకున్నా, పరిస్థితులు మన చేతుల్లో లేవు. తమిళనాడు, కేరళ, బెంగాల్ పరిస్థితులు చూశాం. వచ్చే రెండేళ్లలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఉంటోంది. కొంతమంది మంత్రులు సమాంతర వ్యవస్థలను నడుపుతున్నారన్న విమర్శ ఉంది. కాబట్టి నిర్మాణాత్మక వైఖరి అవసరం. అందుకు అనుగుణంగా కార్యాచరణ కావాలి. ప్రజల్లో ఇమేజ్ సంపాదించాలి. ఇవన్నీ చేసి, మళ్లీ అధికారంలోకి వస్తేనే ఫ్యూచర్ సిటీపై ప్రభావం ఉంటుంది. లేకుంటే ఈ రెండేళ్ల స్వల్ప కాలంలో ఇది మనుగడలోకి రావడం ముమ్మాటికీ సాధ్యం కాకపోవచ్చు.

# దళిత జన బాంధవుడు భాగ్యరెడ్డి వర్మ



అంటరాని తనంపై ఆయన అలు పెరుగని పోరాటం చేశాడు. బాబా సాహెబ్ అంబేద్కర్ తో కలసి ఉద్యమాల్లో పాల్గొన్నాడు. జాతిపిత మహాత్మునిచే గౌరవింప బడినాడు. తాను నమ్మిన సత్యాలను అందరికీ తెలిపి సమాజంలో చైతన్యం తేవడానికి నిస్వార్థసేవ చేశాడు. దళిత స్త్రీల స్థాయిని దిగజార్చి, దేవాలయాల్లో దేవతలకు అంకితమైన అవివాహిత మహిళలు దేవదాసీలుగా, జోగినులుగా, పార్వతు లుగా, జీవితాలను అంకితం చేసే జోగినీ వ్యవస్థ రద్దు, బాల్య వివాహాల వ్యతిరేకత, దళితులలో విద్యా వ్యాప్తి, అసమానత లేని సమాజం కోసం అవిశ్రాంత కృషి చేశాడు. మేము పంచములం కాదు.. ఈ దేశ మూల వాసులం.. ఆది హిందు వులం..' అని గర్వంగా చాటాడు.

అంటరాని వారుగా దూరంగా ఉంచ బడిన వారిని "ఆది హిందువులు"గా భారత దేశంలో తొట్టతొలుత నివసించిన సంతతిగా ఆయన నొక్కి చెప్పాడు. నిజాం పాలిత హైదరాబాద్ రాజ్యంలో దళితోద్యమానికి బాటలు వేసిన ఆ మహానేతనే భాగ్యరెడ్డి వర్మ. హరిజన పదం తెలంగా ణ ప్రాంతంలో వ్యాప్తిలో లేని కాలంలో ఆది హిందువు లుగా, ఆది ఆంధ్రులుగా, ఆది భారతీయులుగా నిమ్నవర్గ ప్రజలు తమను తాము ప్రకటించు కోవాలని కాశీనాథుని నాగేశ్వర రావు పంతులు, మాడపాటి హనుమంతరావుల సహకారంతో భాగ్యరెడ్డి వర్మ ప్రచారం చేశాడు. భాగ్యరెడ్డి వర్మ సేవలు హైదరాబాద్ సంస్థానానికే పరిమితం కాక, తెలుగు నేలపై పలు ప్రాంతాలకూ విస్తరించాడు. లక్నో, అలహాబాద్, కలకత్తా తదితర ప్రాంతాల్లో జరిగిన దళిత చైతన్య మహాసభలకు ముఖ్య అతిధిగా హాజరయ్యాడు.

దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ (మే 22, 1888 – ఫిబ్రవరి 18, 1939) సంఘ సంస్క ర్త, ఆది ఆంధ్ర సభ స్థాపకుడు. హైదరాబాదు సంస్థా నంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశాడు. జగన్మిత్ర మండలి, మన్య సంఘం, సంఘ సంస్కార నాటక మండలి, అహింసా సమాజంలను స్థాపించి హైదరా బాదు ప్రాంతంలో సంఘ సంస్కర ణలకై కృషి చేశాడు.

మాదరి వెంకయ్య, రంగమాంబ దంపతులకు 1888 సంవత్సరం, మే 22వ తేదీన జన్మించిన భాగ య్యకు,1888 నవంబరులో వారి కుటుంబ గురువు భాగయ్యకు బదులు భాగ్యరెడ్డి అని నామ కరణం చేశాడు. ఆయన కుల శైవమత గురువు బోధనలు చేసేవారు.

ఆర్యులు హిందూ దేశానికి వలస రాకముందు, అస్పృశ్యులుగా సమాజంచే ముద్ర వేయబడిన ఆది హిందువులే పాలకులని గురువు వాదం. "రెడ్డి" అన్నది పాలకుడనే అర్థం గల "రేడు" అనే పదం నుంచి ఉద్భవించిందని, అందుచేతనే మాదిరి వెంకయ్యగారి భాగ్యయ్యకు రెడ్డిని జత చేశానని ఆయన చెప్పారు. ఆ తర్వాత 1913లో మాదిరి భాగ్యరెడ్డి హిందూ సమాజానికి చేసిన అపూర్వ సేవలకు గుర్తింపుగా ఆర్య సమాజ్ "వర్మ" అనే బిరుదు ప్రదానం చేశారు. ఆనాటి నుండి బాగయ్య భాగ్యరెడ్డిగా మారి, మాదిరి భాగ్యరెడ్డి వర్మగా, ఎం.వి. భాగ్యరెడ్డి వర్మగా ప్రసిద్ధికెక్కాడు.1913లో 'ఆర్య సమాజ్' ఆయన సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా 'వర్మ' అన్న బిరుదును ప్రధానం చేశారు. దాంతో ఆయన భాగ్యరెడ్డి వర్మగా గుర్తింపు పొందాడు.

భాగ్యరెడ్డి 1906లో షెడ్యూల్డు కులాల బాల బాలికల విద్య కోసం హైదరాబాదు లోని ఈసామియా బజారులో జగన్మిత్ర మండలిని స్థాపించాడు. హరిజనులలో విద్యావశ్యకతను గుర్తించి 1910లో జగన్మిత్ర మండలి ఆధ్వర్యంలో మొదటి ప్రాథమిక పాఠశాలను ప్రారంభించాడు.

భాగ్యరెడ్డి వర్మ అంటరాని కులాల ఉద్ధరణకై 1911లో మన్య సంఘాన్ని ఏర్పాటు చేసి, జగన్మిత్ర మండలి కార్యకలాపాలు మన్య సంఘం ద్వారా కొన సాగించాడు. మన్య సంఘం అంటరాని కులాల ప్రజల్లో చైతన్యం తీసుకు రావటానికి ప్రయత్నించింది. కొంతమంది ఉన్నత కులాల హిందువులు కూడా ఈ భజన మండళ్లను ప్రోత్సహించారు. మన్య సంఘం ఆధ్వర్యంలో ఈ భజన మండళ్లు రీడింగ్ రూములు ఏర్పరచి అందులో ఆంధ్రప్రత్రిక, దీనబంధు మొదలైన పత్రికలను అందుబాటులో ఉంచాయి.

ప్రదానంగా దళిత మహిళను, ఆ తర్వాత వెనకబడిన తరగతులకు చెందిన యువతులను ప్రత్యేకంగా దేవునికి అంకితమిచ్చే కార్యక్రమాలు నైజాం రాజ్యం లోని తెలంగాణ, మరట్వాడా, కన్నడ ప్రాంతాల్లో పురోహితులనబడే జంగాలు నిర్వహించేవారు. ఈ దురాచారాన్ని రూపుమాపడానికి భాగ్యరెడ్డి వర్మ దూరదృష్టితో కార్యాచరణ చేపట్టాడు. ఆయన కృషివల్ల నిజాం దేవదాసీ వ్యవస్థను నిర్మూలించాడు.

1917లో బెజవాడలో జరిగిన తొలి పంచమ మహా సభకు భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షత వహించాడు. ఈ మహాసభలో ఆయన ప్రసంగానికి ప్రభావితులైన నిర్వాహకులు "ఆంధ్రదేశ తొలి ఆది ఆంధ్ర మహాసభ"గా పేరు మార్చారు. తర్వాత 1919లో బందరులో, 1921లో ఏలూరు, భీమవరం, 1925లో అనంతపూర్, 1933లో నాగపూర్, 1938లో కాకినాడ తదితర చోట్ల జరిగిన ఆది ఆంధ్ర మహాసభలకు అధ్యక్షత వహించాడు.1917లో విజయవాడలో ఆంధ్ర పంచమ మహాజన సభలో, భాగ్యరెడ్డి వర్మ, ఏ హిందూ పురాణేతిహాసాల్లోనూ పంచము లనే పదం లేదని, ఈ ప్రాంతానికి మొట్ట మొదటి నుండి స్థానికులైన ప్రజలు పంచములే కాబట్టి, ఆది ఆంధ్రులనే వ్యవహారం సరైనదని తీర్మానించాడు. 1917 నుండి 1938 వరకు ఆది ఆంధ్ర మహా సభలు దాదాపు ప్రతి ఏటా జరిగాయి. అంటరాని వారిని ఆది హిందువులుగా పిలవాలని డిమాండు చేశారు. ఈ ఆది ఆంధ్ర మహాజన సభల ప్రభావంతో 1931 జనాభా లెక్కలలో మాల, మాదిగ, ధేర్, చమర్ లాంటి వారికి నిజాం ప్రభుత్వం ఆది హిందువులుగా పేర్కొన్నది. 1933 కల్లా ఆది – హిందూ సోషల్ సర్వీసు లీగు ఆధ్వర్యంలో 26 పాఠశాలలు ప్రారంభ మయ్యాయి. వీటిలో దాదాపు 2600 మంది విద్యార్థులకు చదువు చెప్పేవారు.

భాగ్యరెడ్డి వర్మకు హిందూమతంపై విశ్వాసం లేక మొదట్లో అర్య సమాజం, బ్రహ్మసమాజం బోధనలను పాటించేవాడు. తర్వాత బౌద్ధం పట్ల ఆకర్షితు డయ్యాడు. గౌతమ బుద్ధుడు ప్రవచించిన సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ మొదలైన అంశాల పట్ల ఆకర్షితుడయ్యాడు. 1913 నుండి ప్రతి వైశాఖ పూర్ణిమ రోజున బుద్ధ జయంతిని జరుపు కొనే వాడు. తన ఏకైక కుమారునికి గౌతమ్ అని పేరు పెట్టుకున్నాడు.

1917 డిసెంబర్ 15వ తేదీన కలకత్తాలో మహాత్మా గాంధీ పాల్గొన్న "అఖిల భారత హిందూ సంస్కరణ మహాసభ"లో భాగ్యరెడ్డి వర్మ కూడా పాల్గొని, అనర్గళంగా, అర్థవంతంగా, ఆలోచనాత్మకంగా చేసిన ప్రసంగం గాంధీజీని సైతం ఆకర్షించింది. మరునాట కలకత్తాలో మహాత్మా గాంధీ అధ్యక్షతన మరో సమావేశంలో పాల్గొనడానికి భాగ్య రెడ్డిని ఆహ్వానించి, వేదిక మీదకు తీసుకు రావడానికి తన ప్రైవేట్ కార్యదర్శిని పంపి, భాగ్యరెడ్డిని, గాంధీజీ తన ప్రక్కన కూర్చో బెట్టు కోవడాన్ని బట్టి ఆయన పట్ల గాంధీకి ఎంత గౌరవమో స్పష్ట మౌతున్నది.
భాగ్యరెడ్డి వర్మ దళితుల నుద్దేశించి...'దళితులే ఈ దేశపు మూల వాసులు. అవిద్య, అజ్ఞానం వల్ల మాత్రమే దళితులు వెనకబడి ఉన్నారు" అని ఆయన బోధించే వారట. దక్కన్‌లో భాగ్యరెడ్డి వర్మ నిర్మించిన ఆదిజన ఉద్యమం దేశవ్యాపితంగా నడిచిన ఆదిజన మూలవాసీ ఉద్యమానికి అనుసంధాన కర్తగా పనిచేసింది. భాగ్యరెడ్డి వర్మ స్థాపించిన భాగ్య నగర్ అనే పత్రికలో సాహిత్యంలో తొలిసారిగా తాను రాసిన నవల వెట్టి మాదిగ సాహిత్యాన్ని తానే తొలిసారి ప్రచురించాడు.

అస్పృశ్యతా నివారణకు భాగ్యరెడ్డి వర్మ చేసిన కృషికి, గుర్తింపుగా హైదరాబాద్‌లోని ఇసామియా బజార్ ప్రధాన రోడ్‌కు 'భాగ్యరెడ్డి వర్మ మార్గ్' అని నగర పాలక సంస్థ దేశ స్వాతంత్ర్యాని కంటే ముందే నామకరణం చేయడం విశేషం. భాగ్య రెడ్డి వర్మ 1939 ఫిబ్రవరి 18న క్షయ వ్యాధితో హైదరా బాదులో మరణించాడు.

**– రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

## ఆఫ్రికాలో తీవ్రం
# అవుతున్న ఎబోలా
### ముందు జాగ్రత్తలు ప్రకటించిన కేంద్రం



**న్యూఢిల్లీ,మే21(నినాదం):** ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ఆరోగ్య కార్యదర్శి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆరోగ్య కార్యదర్శులు హాజరయ్యారు. సమావేశంలో ఎబోలా వైరస్ నివారణకు అవసరమైన ముందుజాగ్రత్తలు, ఆరోగ్య సన్నాహాలు, అత్యవసర స్పందన చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం భారతదేశంలో ఎలాంటి ఎబోలా కేసులు నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఆఫ్రికా దేశాల్లో వైరస్ తీవ్రంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించడంతో కేంద్రం అప్రమత్త చర్యలు ప్రారంభించింది. దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడరేవుల్లో నిఘా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల స్క్రీనింగ్, అనుమానితులను క్వారం టైన్‌లో ఉంచడం, ప్రత్యేక పరీక్షా సదుపాయాలు కల్పించడం వంటి అంశాలపై రాష్ట్రాలకు వివరణా త్మక మార్గదర్శకాలు పంపింది. అదేవిధంగా ఆసుప త్రుల్లో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేయా లని, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచిం చింది. గతంలో అంటువ్యాధుల సమయంలో అమలు చేసిన విధానాలను మళ్లీ కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ప్రస్తుతం ఆఫ్రికా దేశమైన డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఎబోలా తీవ్రస్థాయిలో వ్యాపిస్తోంది. అక్కడ అనేక కేసులు నమోదయ్యాయి. కాంగోతో పాటు ఉగాండా, కెన్యా వంటి పొరుగు దేశాలకు కూడా వైరస్ వ్యాపించినట్లు సమాచారం. వందలాది మంది అనుమానిత లక్షణాలతో వైద్య పర్యవేక్షణలో ఉన్నారు.



# సరస్వతీ మాతకి జై..

పవిత్ర త్రివేణి సంగమ క్షేత్రం కాళేశ్వరం
సరస్వతీ అంత్య పుష్కర స్నానం పరమ
పవిత్రం
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత
ప్రథమం సరస్వతీ అంత్య పుష్కరం.
ఆధ్యాత్మిక జీవన శైలితో తగిన మోక్షం.
వెల్లువెత్తుతున్న భక్తి పారవశ్యం.
చిన్న పెద్ద కుటుంబాలతో
కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వద్దకు పయనం.
దక్షిణ కాశీ గా పేరు గాంచిన కాళేశ్వరంకి
వివిధ రాష్ట్రాల భక్తులతో పోటెత్తితున్న జనం.
ప్రయాగ్ రాజ్ ల ముస్తాబు అయిన
కాళేశ్వరం.
జ్ఞానానికి సంస్కృతికి విద్య కు
ప్రతి రూపం సరస్వతీ పుష్కరం.
వేద కాలం నుండి సరస్వతీ నదికి
గల గౌరవం అపారం.
ఋగ్వేదం లో సప్తమీ సింధూ మాతగా నామ
కరణం
గోదావరి ప్రాణహిత అంతర్వాహినిగా
సరస్వతీ నదుల సంగమం
సరస్వతీ అంటేనే కనపడని చైతన్య ప్రవాహం
కంచి కామ కోటి పీఠాధిపతి విజయేంద్ర
సరస్వతీ స్వామీజీ చే తొలి పుష్కర స్నానం
ప్రారంభం
ప్రతీ పన్నెండు ఏళ్ల కో సారి ఆగమనం
సరస్వతీ నది భూమి మీద కనిపించని
అదృశ్య ప్రవాహం
దక్షణ భారత్ దేశంలో
సరస్వతీ పుష్కరముతో కాళేశ్వరం ప్రసిద్ధం.
గంగా హారతి,వేద పారాయణాలు,
భజన కార్యక్రమాలు,స్నాన తర్పణ పూజలు,
పిండ ప్రదానాలచే జన ప్రవాహం
పుష్కర స్నానం శరీర శుద్ధి ఆత్మ శుద్ధితో
మమేకం.
చీమల బారుల్లా కదులు తున్న భక్త జనం.
ఎండ వేడిమిని లెక్క చేయని వైనం
సరస్వతీ మాత కి జై కొడదాం
అంత్య పుష్కరాలను విజయ వంతం చేద్దాం

**–కామిడి సతీష్ రెడ్డి**
**జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా**
**9848445134**

## ఇరాన్‌తో
# తలగొక్కున్న అమెరికా

**వాషింగ్టన్:** ఇరాన్‌పై యుద్ధంతో అమెరికాకు భారీ నష్టం వాటిల్లిందని యుఎస్ కాంగ్రెస్ రీసెర్చ్ సర్వీస్ (సిఆర్ఎస్ ) ఒక నివేదికలో తెలిపింది. ఈ నష్టాల కారణంగా పెంటగాన్ అంచనా వేసిన సైనిక కార్యాచరణ వ్యయం భారీగా పెరిగి 29 బిలియన్ డాలర్లకు అంటే సుమారు రూ. 2.4 లక్షల కోట్లు చేరినట్లు తెలిపారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా ఇరాన్ పై దాడులకు దిగిన సంగతి తెలిసిందే. ఈ యుద్ధంలో అమెరికాకు చెందిన సుమారు 42 అత్యాధునిక యుద్ధ విమానాలు, ఎంక్యూ–9 రీపర్ డ్రోన్లు పూర్తిగా ధ్వంసమవ్వడమో లేదా తీవ్రంగా దెబ్బతినడమో జరిగిందని ఈ నివేదిక పేర్కొంది. వర్గీకరణ, కొనసాగుతున్న పోరాట కార్యకలాపాలు, బాధ్యతను గుర్తించడం వంటి పలు కారణాల వల్ల దెబ్బతిన్న లేదా ధ్వంసమైన విమానాల సంఖ్య సవరణకు లోబడి ఉండవచ్చని సిఆర్ ఎస్ తెలిపింది. ధ్వంసమైన లేదా దెబ్బతిన్న వాయుసేన ఆస్తులలో అత్యధికంగా 24 ఎంక్యూ–9 రీపర్ డ్రోన్లు, ఒక ఎంక్యూ–4సి ట్రిటాన్ డ్రోన్ ఉన్నాయి. వీటితో పాటు నాలుగు ఎఫ్–15ఇ స్ట్రైక్ ఈగిల్ ÷టైర్ జెట్లు, ఒక అత్యాధునిక ఎఫ్–35ఎ లైట్నింగ్ ఎఎ స్టీల్త్ ÷టైర్ జెట్, ఒక ఎ–10 థండర్‌బోల్ట్ గ్రౌండ్–అటాక్ ఎయిర్‌క్రాఫ్ట్ కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. అమెరికా రక్షణ శాఖ ఇప్పటివరకు అధికారికంగా నష్టాల పూర్తి వివరాలను వెల్లడించనప్పటికీ, దెబ్బతిన్న యుద్ధ పరికరాల మరమ్మతులు, పునరుద్ధరణ ఖర్చులు ఊహించిన దానికంటే విపరీతంగా పెరిగాయని పెంటగాన్ తాత్కాలిక కాంప్ట్రోలర్ జూల్స్ డబ్ల్యు హర్స్ట్ ఎఎ ప్రతినిధుల సభలో అంగీకరించిన సంగతి తెలిసిందే.

# బధిర ఉద్యోగుల ప్రతిభకు తగిన గుర్తింపు కల్పించాలి

## కరీంనగర్‌లో బధిర ఉద్యోగుల రాష్ట్ర సంఘం 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ

### ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి




**కరీంనగర్, జూలై11(సింగిడి):** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (టీఎన్‌జీఓలు) అనుబంధంగా ఏర్పాటైన మాట, వినికిడి లోపం (బధిర) ఉద్యోగుల రాష్ట్ర సంఘం 10వ వార్షికోత్సవ వేడుకలు శనివారం కరీంనగర్ జిల్లా టీఎన్‌జీఓల కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు అనిల్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని 33 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బధిర ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీఎన్‌జీఓల జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, బధిర ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు రమణారావు, జిల్లా కార్యదర్శి సంగేమ్ లక్ష్మణ్‌రావు, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన బధిర ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, బధిర ఉద్యోగులకు వినికిడిలో మాత్రమే లోపం ఉంటుంది. సేవాభావం, క్రమశిక్షణ, నిజాయితీ, ఆత్మవిశ్వాసం, ప్రతిభలో ఎలాంటి లోపం ఉండదు" అని అన్నారు. వివిధ రంగాల్లో వారు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని పేర్కొంటూ, వారిని జాలితో కాకుండా గౌరవంతో చూడాలని, వారి ప్రతిభకు తగిన గుర్తింపు కల్పించాలని పిలుపునిచ్చారు. బధిర ఉద్యోగుల సంక్షేమం, పదోన్నతులు, బదిలీలు, శాఖాపరమైన పరీక్షల మినహాయింపు, సీనియారిటీ ఆధారిత ప్రమోషన్లు తదితర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేవం-కు టీఎన్‌జీఓల సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వికలాంగ ఉద్యోగులకు అనుకూల బదిలీల కోసం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను స్వాగతిస్తూ, బధిర ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. బధిర ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు రమణారావు, టీఎన్‌జీఓల జిల్లా కార్యదర్శి సంగేమ్ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ, బధిర ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు టీఎన్‌జీఓల సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు శక్తి, సంతోష్, బాబు జాన్ చల్ల రాములు, క్రాంతి ప్రసాద్, తిరుపతయ్య, సోహియా, ప్రణతితో పాటు రాజా వీర్ రెడ్డి, కీర్తి, చైతన్య, రోహిత్ రెడ్డి, సురేష్, మహేష్, ఆంజనేయులు, దేవయ్య, లక్ష్మయ్య, చిన్నయ్య, ధనరాజ్ తదితర రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, 33 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, బధిర ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు

### డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు

### ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు..

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



**కరీంనగర్, జూలై 11(సింగిడి):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం కరీంనగర్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులతో కలిసి భగత్‌నగర్‌లోని శిబిర కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్థానిక ప్రజలకు పూల మొక్కలు, పండ్లు, ఔషధ మొక్కలు పంపిణీ చేసి, ప్రతి ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. బండి సంజయ్ కుమార్ సంకల్పం మేరకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో భగత్‌నగర్ పోలీసు నివాస సముదాయంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించారు. సుమారు 60 మంది విద్యార్థులకు పాఠశాల సంచులు, బూట్లు, సాక్సులు, బెల్టులు, టైలు, బ్యాడ్జీలు, నోట్‌బుక్స్, పెన్నులు తదితర విద్యా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్‌రావు మాట్లాడుతూ, కరీంనగర్ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. స్మార్ట్ సిటీ, అర్బన్ ఛాలెంజ్ ఫండ్, అమృత్ పథకాల ద్వారా నగరానికి భారీ నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి బాటలు వేసిన నాయకుడిగా ఆయన సేవలను ప్రశంసించారు. ప్రజా సేవలో బండి సంజయ్ కుమార్ మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి, ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవ చేసే అవకాశాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీవాసులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడా సంస్కృతి వికాసానికి వ్యాయామ ఉపాధ్యాయులే కీలకం

### క్రీడా విజ్ఞాన రథం' శిక్షణ కార్యక్రమంలో

### జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి వి. శ్రీనివాస్ గౌడ్



**కరీంనగర్, జులై11 (సింగిడి):** క్రీడా సంస్కృతిని జిల్లా వ్యాప్తంగా విస్తరించే బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులపై ఉందని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో శనివారం నిర్వహించిన 'క్రీడా విజ్ఞాన రథం' (స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్) శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ఏర్పాటు చేస్తున్న క్రీడా విశ్వవిద్యాలయ కార్యక్రమాల్లో భాగంగా ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు అందించే నాణ్యమైన శిక్షణ ద్వారానే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థకు చెందిన అతిథి కోచ్ విశాల్ మాట్లాడుతూ, క్రీడా శిక్షణకు ముందు చేయాల్సిన వార్మప్, అనంతరం నిర్వహించాల్సిన శరీర సడలింపు వ్యాయామాల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల శారీరక సామర్థ్యం, ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని వారికి అనువైన క్రీడను ఎంపిక చేయాలని సూచించారు. ఇతర కోచ్‌లు పాఠశాల స్థాయిలో చిన్నారులకు నిర్వహించాల్సిన క్రీడలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాధారణంగా జరిగే పొరపాట్లు మరియు వాటి నివారణపై అవగాహన కల్పించారు. ఫిజియోథెరపిస్ట్ కృష్ణ ప్రసాద్ క్రీడల సమయంలో సంభవించే గాయాలు, వాటి నివారణకు ఫిజియోథెరపీ విధానాలను వివరించారు. అనంతరం క్రీడా పాఠశాల విద్యార్థులతో వార్మప్ వ్యాయామాలను ప్రదర్శించి వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ రహీం, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి. వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడా పాఠశాల కోచ్‌లు, జిల్లాలోని సుమారు 100 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నాణ్యమైన సేవలు అందించండి

### మల్టిస్పెషలిటీ అస్పత్రి ప్రారంభం

### ప్రజలకు డాక్టర్లు దేవుడితో సమానం

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి





**అమనగల్లు, జూలై 11(సింగిడి):** పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. అమనగల్లు పట్టణంలో శనివారం పోస్టాఫీస్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'విహ' మల్టి స్పెషలిటీ ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. తలకొండపల్లి మండలానికి చెందిన శిశు వైద్య నిపుణుడు డాక్టర్ వెంకటేష్ దంపతుల ఏర్పాటు చేసిన ఆసుపత్రిని ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, సిఐ వెంకటేశ్వర్లు, డాక్టర్ వెంకటేష్ కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు మండలాలకు కూడలి అయిన అమనగల్లు సమీపంలో ప్రజలకు వైద్య అవసరాలను చేరువ చేసేలా అనుభవం కలిగిన వైద్యులతో మెరుగైన వైద్యం అందించాలన్నారు. రాష్ట్రంలోని పేదలకు ఆధునిక వైద్యం ప్రభుత్వం అందుబాటులో తీసుకొచ్చిందని అంతేకాకుండా ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించేలా విహ మల్టి స్పెషలిటీ అస్పత్రి నిర్వాహకులు, వైద్యులు పనిచేయాలని సూచించారు. సకల సౌకర్యాలతో మెరుగైన వైద్య సేవలు అందించడానికి హాస్పిటల్ ను ప్రారంభించడం చాలా సంతోషకరమైన విషయమని, ఇక్కడి ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ప్రజలకు డాక్టర్లు దేవుడి తో సమానం అని పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని సామాజిక సేవ రూపంలో సరసమైన ధరలతో మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందలని, రోగుల పట్ల ప్రేమాభిమానాలు చూపిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించి, ఆరోగ్యవంతులుగా తీర్చిద్దిదాలని వారు పేర్కొన్నారు. ఓపీ, ఇన్పేషెంట్ వార్డులు, అత్యవసర చికిత్స విభాగం, ల్యాబ్ తదితర సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం అస్పత్రి డాక్టర్లు మాట్లాడుతూ ప్రజలకు వైద్యం అవసరాలను చేరువ చేసేలా ఈ అస్పత్రి ఏర్పాటైందని, అత్యవసర చికిత్సలు ఉంటాయని అనుభవం కలిగిన వైద్యులతో మెరుగైన వైద్యం అందించడం పై నిబద్ధతతో పనిచేయనున్నామని అస్పత్రి డాక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు టౌన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివలింగం, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మానయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, జగన్, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్, డైరెక్టర్ శ్రీశైలం, ఎంగలి ప్రసాద్, కేఎస్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా, మాజీ ఎంపీపీ అనిత, ఫరీద్, సురేష్, రాజు, షాబుద్దీన్, మహేష్ పాల్గొన్నారు.

# త్వరలో భూభారతి రీ సర్వే : జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్




**నల్లగొండ ప్రతినిధి జులై 11(సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్దేశించిన గ్రామాలలో సోమవారం నుండి భూభారతి రీ- సర్వే చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తెలిపారు . భూ భారతి రీ -సర్వే, సాదా బైనామాలు, ఇందిరమ్మ ఇండ్లు, తదితర అంశాల పై రాష్ట్ర రెవిన్యూ ,గృహ నిర్మాణ ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం ఖమ్మం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లాలో భూభారతి రీ- సర్వే పై జిల్లా కలెక్టర్ వివరాలను మంత్రికి సమర్పిస్తూ సోమవారం నుండి నిర్దేశించిన 70 గ్రామాల లో రీ సర్వే నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ,గతంలో ప్రజాపాలన, రెవెన్యూ సదస్సులు, ఇతర సందర్భాలలో స్వీకరించిన దరఖాస్తులన్నింటి పరిగణనలోకి తీసుకొని సర్వే నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాకు ఇదివరకే కేటాయించిన లైసెన్స్ సర్వేయర్లతో సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, కొంతమంది సర్వేయర్లను మిర్యాలగూడ నక్ష సర్వే కార్యక్రమంలో వినియోగించుకొంటున్నామని, వారిని కూడా రీ సర్వేలో భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. సర్వే నిర్వహించేందుకు జిల్లాలో అవసరమైన యంత్ర సామాగ్రి అందుబాటులో ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు. నల్గొండ జిల్లాలో సర్వేను వేగవంతం చేయాలని ఈ విషయమై రెవిన్యూ అదనపు కలెక్టర్, ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని మంత్రి ఆదేశించారు. అంతకుముందు మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు రెవెన్యూ అధికారులకు భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు భూభారతి రీ - సర్వే ఒక్కటే మార్గమని, అందువల్ల జిల్లా కలెక్టర్లు , రెవెన్యూ అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు బోయ్ భారతి రీ- సర్వే పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. గతంలో లోపభూయిష్టంగా ఉన్న ధరణి స్థానంలో భూ భారతిని తీసుకురావడం జరిగిందని, భూ భారతి చట్టం పూర్తిస్థాయిలో అమలైనప్పుడే భూ ఆసాములకు న్యాయం కలగడమే కాకుండా వారి భూములకు భద్రత ఏర్పడుతుందన్నారు . రీ -సర్వే కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే లైసెన్సుడ్ సర్వేయర్లను జిల్లాలకు కేటాయించి శిక్షణ ఇవ్వడం జరిగిందని ,వారి సేవలను వినియోగించుకోవాలని, ఇందుకుగాను ప్రస్తుతం పనిచేస్తున్న సర్వేయర్లతోపాటు, తక్కిన వారికి ఈనెల 20 లోపు వాట్సప్ మెసేజ్ ద్వారా సమాచారం అందించి వెంటనే విధులలో చేరి సర్వే పనులు ప్రారంభించే విధంగా చూడాలని, నెలాఖరునాటికి ఎంతమంది సర్వేయర్లు పనిచేస్తున్నది, ఎంత మంది పనిచేయని వివరాలు సమర్పించాలని చెప్పారు. ఒకవేళ ఎవరైనా పని చేసేందుకు ఇష్టం లేకపోతే అలాంటి వారి లైసెన్సును రద్దు చేస్తామని తెలిపారు. పనిచేస్తున్న సర్వేయర్లకు సంబంధించిన కమిషన్ చెల్లింపులో జాప్యం చేయవద్దని కలెక్టర్లతో కోరారు. నిర్దేశించిన గ్రామాలలో సర్వేను వేగవంతం చేయాలని, అలాగే ఇదివరకే నిర్దేశించిన సమయం ప్రకారం మార్చి 2027 లోపు మూడు విడతల సర్వే పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ళపై మంత్రి మాట్లాడుతూ మొదటి విడతలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు ఇంకా కొన్నిచోట్ల పెండింగ్ లో ఉన్నాయని ,వాటిని వెంటనే పూర్తి చేయాలని, రెండో విడత మంజూరు చేసిన ఇండ్ల పనులు కూడా ప్రారంభమవుతున్న దృష్ట్యా మొదటి విడత ఇండ్లు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెండవ విడతలో గుడిసెలలో నివసించే వారికి ప్రాధాన్యత ఇస్తున్నామని, కొన్ని జిల్లాలలో గుత్తి కోయలు ఎక్కువగా గుడిసెలలో నివసిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, గుత్తి కోయిలకు మంజూరు చేసే ఇండ్లు సాధారణ మంజూరు జాబితాలో కలపకుండా వేరువేరుగా తయారు చేయాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తయిన చోట లబ్ధిదారులకు అప్పగించాలని మంత్రి ఆదేశించారు.

ఈ సందర్భంగా సెర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీల విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీలో భాగంగా ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి జూలై 15, 30, ఆగస్టు 15న విడతలవారీగా బాలికలరెసిడెన్షియల్ పాఠశాలలు, బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ముందుగా ఒక జత యూనిఫామ్ ఇచ్చేందుకు సరిపోయే వస్త్రం రానుందని, అందువల్ల ఈ విషయంపై జిల్లా కలెక్టర్లు తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు, రెసిడెన్షియల్ పాఠశాలల ఆర్సీవోలు, తదితరులతో సమావేశం నిర్వహించి యుద్ధ ప్రాతిపదికన యూనిఫామ్ కుట్టించే ఏర్పాటు చేయాలని, మెప్మా, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా స్వయం సహాయక మహిళా సంఘాలలో ఇది వరకే టైలర్లను గుర్తించడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం యూనిఫామ్ త్వరితగతిన కుట్టించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్, గృహ నిర్మాణ శాఖ ఎండి గౌతమ్ రాష్ట్ర స్థాయి విసీ నుండి పాల్గొనగా, జిల్లా నుండి జిల్లా కలెక్టర్ తో పాటు, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ డి దేవరాజ్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీంద్రరావు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

# సుందిళ్ల కరకట్టకు దిక్కెవరు?

### వరదలు వస్తే ఐదు గ్రామాలకు ముప్పు

### రెండేళ్లుగా పట్టించుకోని అధికారులు, పాలకులు

### అధికారుల నిర్లక్ష్యమే ప్రజలకు శాపంగా మారిందా?

**కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి సుందిళ్ల పార్వతి బ్యారేజ్‌కు ముప్పు!రెండేళ్లుగా దెబ్బతిన్న కరకట్టకు మరమ్మతులే లేవు వరదలు వస్తే ఐదు గ్రామాల ప్రజల్లో ఆందోళన. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**



**గోదావరిఖని, జూలై 11(సింగిడి):** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన సుందిళ్ల పార్వతి బ్యారేజ్ భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బ్యారేజ్ కుడి కరకట్ట దెబ్బతిని రెండేళ్లు గడిచినా శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరిలో భారీ వరదలు వస్తే సుందిళ్లతో పాటు పరిసర ఐదు గ్రామాలకు ప్రమాదం పొంచి ఉందని గ్రామస్థులు భయం గుప్పిట్లో ఉన్నారు . స్థానికుల కథనం ప్రకారం, రెండేళ్ల క్రితం భారీ వర్షాలు, వరదల కారణంగా కరకట్టలో కొంత భాగం దెబ్బతింది, శాశ్వత పునర్నిర్మాణం మాత్రం ఇప్పటికీ చేపట్టలేదు. దీంతో కరకట్ట మరింత బలహీనపడిందని ప్రజలు చెబుతున్నారు. ఈ ఏడాది కూడా భారీ వర్షాలు కురిసి గోదావరిలో వరద ప్రవాహం పెరిగితే సుందిళ్లతో పాటు పరిసర ప్రాంతాలైన ముస్త్యాల,బెస్తపల్లి,సిరిపురం, చశీదనాపూర్ గ్రామాలు వరద ముప్పును ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూములు, పంటలు, ఇళ్లు, రహదారులు, విద్యుత్ సౌకర్యాలు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. గ్రామస్థులు పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఇప్పటివరకు శాశ్వత చర్యలు కనిపించలేదని ఆరోపిస్తున్నారు. వర్షాకాలం పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యేలోపు కరకట్టను బలోపేతం చేసి మరమ్మతులు పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడాలంటే వెంటనే సాంకేతిక నిపుణులతో కరకట్టను పరిశీలించి అత్యవసర మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన నిధులను మంజూరు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఓటర్ల సందేహాలను బిఎల్‌వోలు నివృత్తి చేయాలి

### బీఆర్ఎస్ మండల అధ్యక్షులు

### రవికుమార్ యాదవ్



**అమరచింత, జూలై 11, (సింగిడి):** స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (సర్ ) ప్రత్యేక ఓటర్ సవరణ జాబితాలో ఓటర్లకు ఉన్న సందేహాలను బూత్ లెవెల్ ఆఫీసర్లు నివృత్తి చేయాల్సిన బాధ్యత ఉందని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రవికుమార్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన ఆత్మకూరు మున్సిపాలిటీలోని 7, వ వార్డులో జరుగు తున్న సర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్వోలతో రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత బి ఎల్ వో లకు ఉందన్నారు. నా ఓటు నా హక్కు అనే భావనతో సర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితా అత్యంత అవసరమన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకొని వివరాలు ఇవ్వాలని కోరారు. కొత్త ఓటర్లను చేర్చడం మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు.

# యువకులు సేవా భావం పెంపొందించుకోవాలి



**కమలాపూర్ , జులై 11 (సింగిడి) :** గ్రామంలోని యువకులు సేవా భావం పెంపొందించుకుని గ్రామభివృద్ధిలో భాగస్వాములు కావాలని కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా గ్రామ పంచాయతీ పాలక మండలి ఆధ్వర్యంలో ఊరు కోసం ఒక్క రోజు శ్రమదానం కార్యక్రమం 9 వ వారం శనివారం నిర్వహించారు. పాలక మండలి సభ్యులతో పాటు ప్రగతి యువజన సంక్షేమ సంఘం, ప్రగతి స్వచ్ఛంద సంస్థ సభ్యులు, 12 వార్డులో వార్డు సభ్యులతో కలిసి రోడ్లు, మురికి కాలువలు శుభ్రం చేశారు. పారిశుధ్యం పరిరక్షించుకోవడం లో ప్రజల భాగస్వామ్యం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో యువకులు సేవా భావం పెంచుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఓస్కుల కీర్తన, పుల్ల ఐలయ్య, ఎండబెల్లి మల్లారెడ్డి, రాంశెట్టి రాజయ్య, గంధసిరి అనీల్, పుల్ల శ్రీనివాస్, మౌటం నాగరాజు, నాయకులు పిల్లి సతీష్, మార్క అశోక్, జన్ను బిక్షపతి, ప్రగతి యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలసాని కుమారస్వామి, గౌరవ అధ్యక్షులు బాలసాని దేవేందర్ గౌడ్, పాలక మండలి సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

### తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లో

## పూర్తిస్థాయిలో వసతులు



**గద్వాల ప్రతినిధి (సింగిడి):** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 2026-2027 విద్యా సంవత్సరం నుంచి తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తుండడంతో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తుండడంతో గద్వాల మండలం కాకులారం గ్రామ జడ్పీహెచ్ఎస్ లో భవన నిర్మాణానికి బుధవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతానికి ఇక్కడ సుమారు 130 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ, భవిష్యత్తులో సుమారు 1500 మంది విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని మౌలిక సదుపాయాల విస్తరణ అవసరమని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఇక్కడ 5 ఎకరాల స్థలం ఉండడంతో పెద్ద డైనింగ్ హాల్ నిర్మాణం, క్రీడా మైదానం ఏర్పాటు, అలాగే ఇంటర్మీడియట్ (11, 12 తరగతులు) కోసం అదనపు తరగతి గదుల నిర్మాణం అవసరమని అన్నారు. అదేవిధంగా విద్యార్థుల శ్రేయస్సు కోసం సైన్స్ ల్యాబ్, ఫిజిక్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ (40--60 మంది సామర్థ్యంతో), మరియు లైబ్రరీ ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే మంజూరైన 24 తరగతి గదుల నిర్మాణం (గ్రౌండ్ ఫ్లోర్ 12, ఫస్ట్ ఫ్లోర్ 12) పనులపై సమీక్ష నిర్వహించగా, మిగిలిన పనులు పూర్తి చేయడానికి అదనపు నిధులు అవసరమని గుర్తించారు. ఈ మేరకు ప్రభుత్వానికి సమగ్ర ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు. అదనంగా శిక్షకుల నియామకం, క్యాంపస్ అభివృద్ధి కోసం ఫెన్సింగ్, బౌండరీ వాల్, అంతర్గత రోడ్లు నిర్మాణం వంటి అంశాలు కూడా చర్చించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని పూర్తి స్థాయి విద్యా, వసతి, క్రీడా సదుపాయాలతో కూడిన క్యాంపస్‌ను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పాఠశాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో డీఈవో విజయలక్ష్మి, ఈడబ్ల్యుఐడిసి డిఈ ఇక్బాల్ హుస్సేన్, ఏఈ మోహన్ రెడ్డి, సెక్టోరియల్ అధికారి మైఖేల్, తదితరులున్నారు.

### దళారులను నమ్మి రైతులు నష్టపోవద్దు..

**అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ విజయుడు**



**గద్వాల బ్యూరో (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తా మార్కెట్ యార్డ్ నందు ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ విజయుడు బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ.. రైతులు తాము కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు దళారులకు అమ్ముకొని నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయిం చిన మద్దతు ధరకే రైతులు తమ పంటను విక్రయించుకోవాలని, తద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని ఆయన కోరారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రైతు సోదరులు పాల్గొన్నారు.

### అక్రమ ఇసుక లారీల సీజ్...
### ...నలుగురిపై కేసు నమోదు...



**ఆర్మూర్, (సింగిడి):** నిజామాబాదు జిల్లా బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ మండల కేంద్రంలోని లక్కోరా గ్రామ శివారులో మంగళవారం రాత్రి పోలీసులు జరిపిన తనిఖీల్లో రెండు అక్రమ ఇసుక లారీలు పట్టుబడ్డాయి. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా వున్నాయి. మంగళవారం రాత్రి లక్కోరా శివారులో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, ఇసుక లోడుతో వస్తున్న రెండు లారీలను ఆపి తనిఖీ చేశారు. వాటికి సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు (పర్మిట్లు) లేకపోవడంతో పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.
లారీ నంబర్లు: 1. టీ 07 ఖ 3366 2. వీ 43 9494 డ్రైవర్లను అదుపులోకి తీసుకుని విచారించగా, జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలోని వాగు నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను నింపుకొని వస్తున్నట్లు అంగీకరించారు. ఈ మేరకు ఇద్దరు డ్రైవర్లతో పాటు ఇద్దరు యజమానులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రజలు ఎవరైనా ఇసుక కావాలనుకుంటే ప్రభుత్వం నిర్దేశించిన 'మన ఇసుక వాహనం' ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలి. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వేల్పూర్ ఎస్. ఐ. సంజీవ్, తెలిపారు.

### మైనర్లు వాహనాలు నడుపుతే కఠిన చర్యలు

**అయిజ ఎస్సై 2, కిరణ్**



**గద్వాల ప్రతినిధి (సింగిడి):** జోగులంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా నేడు రోడ్డు భద్రత వారోత్సవాలలో సందర్భంగా అయిజ పట్టణ ఎస్సై 2 కిరణ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కిరణ్ మాట్లాడుతూ.. వాహనం నడుపుతున్న వ్యక్తి వెనక్కు కూర్చున్న వ్యక్తి ఇద్దరు కూడా హెల్మెట్ ధరించాల్సిందేనని అన్నారు. ఈ మధ్యకాలంలో మైనర్లు వాహనం నడపడం వల్ల చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి కావున తల్లిదండ్రులు కూడా మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల మనకి మనమే ప్రమాదాలు కొని తెచ్చుకొని అవకాశం ఉంది అన్నారు. ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్లకు పౌచ్ ఎలా అయితే వేసుకుంటాము అలానే మన తలకు హెల్మెట్ పెట్టుకోవాలని ఆ మొబైల్ ఫోన్ పోతే తిరిగి తెచ్చుకోగలం కానీ ప్రాణం పోతే ఎవరు కూడా తెచ్చుకోలేం ఆ కుటుంబం రోడ్డున పడుతున్నది పేర్కొన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి మద్యానికి దూరంగా ఉండి వాహనాలను నడపాలని సూచించారు. మైనర్ నడిపి ప్రమాదం చేస్తే, ఇన్సూరెన్స్ క్లెయిమ్ చెల్లదు. ప్రమాదంలో ఎవరైనా చనిపోతే, యజమానిపై ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తారు. జువైనల్ జస్టిస్ బోర్డ్ ముందు మైనర్‌ను హాజరుపరచాల్సి ఉంటుందని, రోడ్డు భద్రత, హెల్మెంట్, ట్రాఫిక్ నిబంధన, ఓవర్టేక్ తధితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, తల్లిదండ్రులకు కూడా బాధ్యత ఉంటుందని, వాహనాలు ఇవ్వొద్దని హెచ్చరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ శ్రీనివాసులు, రమణ, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు స్వీయ నియంత్రణ తప్పనిసరి



**నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వల్లే పెరుగుతున్న ప్రమాదాలు**

**రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్**



**నిజామాబాద్ ప్రతినిధి ,(సింగిడి):** నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని రాష్ట్ర రవాణా, బీ.సీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం నిజామాబాద్ శివారులోని సుగుణ గార్డెన్స్ లో పోలీస్ రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్-అలైవ్ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమీషనర్ ఇలంబర్తి, ఆర్టీసీ ఎం.డీ నాగిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, మేయర్ ఉమారాణి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు స్వీయ నియంత్రణ పాటించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాలు నడపడం, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతున్నాయని అన్నారు. వ్యక్తిగతంగా వారి కుటుంబాలతో పాటు సమాజానికి, ఇతరులకు కూడా తీరని నష్టం చేకూరుస్తున్నారని, ఎవరికివారు తమవంతు బాధ్యతగా భావిస్తూ ట్రాఫిక్ రూల్స్ ను విధిగా పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని హితవు పలికారు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులై నిండు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. మనపై కుటుంబం ఆధారపడి ఉందనే విషయాన్ని గుర్తుంచుకుని, తప్పక ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లేకుంటే కుటుంబం మొత్తం చిన్నాభిన్నం అయ్యే పరిస్థితి నెలకొంటుందని అన్నారు. నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ చలానాలు విధించినా, ఎన్ని చట్టాలు వచ్చినా, ప్రభుత్వ యంత్రాంగం ఎంతటి కఠిన చర్యలు చేపట్టినా కూడా, ప్రజల ఆలోచనా విధానాల్లో మార్పు రానంతవరకు రోడ్డు ప్రమాదాల పరిస్థితిలో మార్పు రాదని అభిప్రాయపడ్డారు. ప్రమాదాలను నిలువరించేందుకు ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతూ, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హితవు పలికారు. ప్రజల్లో అవగాహనను పెంపొందించేందుకు ఉద్దేశించిన అరైవ్-అలైవ్ లో భాగంగా విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ దిశగా ప్రభుత్వం కూడా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని గుర్తు చేశారు. ఇదిలాఉండగా, నిజామాబాద్ జిల్లాకు త్వరలోనే కొత్త బస్ డిపో రానుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా ప్రతిరోజూ 10వేల బస్సులు సుమారు 35 లక్షల కిలోమీటర్లు తిరుగుతూ, 65 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆర్టీసీ సంస్థ పరిరక్షణే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రవాణా శాఖ పరంగా కూడా చెక్ పోస్టులు ఎత్తివేయడం వంటి అనేక నూతన సంస్కరణలను అమల్లోకి తెచ్చామని గుర్తు చేశారు. రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలలో మన దేశంలో ప్రతి ఏటా లక్షా 50 వేల మంది, రాష్ట్రంలో 7వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. వీటిలో సుమారు 45శాతం వరకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించని కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను విధిగా పాటించి ప్రమాదాలకు నియంత్రించేందుకు కృషి చేయాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, సీపీ సాయి చైతన్యలు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటు బెల్టు ధరించకపోవడం, అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ఓవర్ టేక్ చేయడం, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఆటోలలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, రాంగ్ సైడ్ వెళ్లడం, సిగ్నల్స్ జంప్ చేయడం తదితర కారణాల వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ప్రమాదాల సంఖ్య పెరిగేందుకు కారణమవుతోందని అన్నారు. అతివేగాన్ని మానుకోవాలని, రోడ్డు భద్రతా నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎంతో అప్రమత్తతో వాహనాలు నడపాలని హితవు పలికారు. ఈ సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి బాధితులు వెల్లడిస్తూ కన్నీటి పర్యంతం అయ్యారు. అతి వేగం, అజాగ్రత్తగా వాహనాలు నడిపి తమ లాంటి దుస్థితిని కొని తెచ్చుకోవద్దని విజ్ఞప్తి చేయడం అందరినీ ఆలోచింపజేసింది. రహ్ వీర్, పీ.ఎం రాహత్, హిట్ అండ్ రన్ లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక తోడ్పాటు, ప్రోత్సాహకాలపై ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు వీలుగా రూపొందించిన గోడ ప్రతులను, కర పత్రాలను మంత్రి ఆవిష్కరించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజిరెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, డాక్టర్ కవితా రెడ్డి, డీటీసీ దుర్గా ప్రమీల, డీటీఓ ఉమా మహేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.




# లక్ష్య సాధనకు విద్యార్థులు కష్టపడాలి..

**- గ్రామాల్లో ఉన్న పాఠశాలల అభివృద్ధి అందరి బాధ్యత.**

**-దాతల సహకారం అభినందనీయం... -గ్రంథాలయం, కళావేదికను ప్రారంభించిన డిఈవో**



**ఖమ్మం,(సింగిడి):** నిజాయితీ, నిబద్ధతతో సమాజానికి సేవలు అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి చైతన్యజైని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆమె తెలిపారు. బుధవారం ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని రఘునాథపాలెం మండల మంచుకొండ ఉన్నత పాఠశాలలో మందడపు పద్మ మందడపు నర్సింహారావు దంపతులు ఏడు లక్షల రూపాయాలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని, కళావేదికను ముఖ్య అతిథిగా హాజరైన డిఈవో చైతన్యజైని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఈవో మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని తెలిపారు. సమాజానికి తాము ఏమిస్తున్నామనేది గుర్తెరిగి సేవలు అందించాలని తెలిపారు. విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. మంచుకొండ పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు, దాతలు అందిస్తున్న సహకారం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి ప్రోత్సాహం ఉంటే ఉపాధ్యాయులు కూడా ఉత్తమ విద్యను అందించేందుకు కృషి చేస్తారని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు తాను వ్యక్తిగతంగా గిఫ్ట్ టు చిల్డ్రన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. నేలకొండపల్లిలో విద్యార్థుల కోసం స్నాక్స్ అందించే కార్యక్రమాన్ని పూర్తిగా తాను దత్తత తీసుకుని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంచుకొండ పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో టాప్ ర్యాంకు సాధించే విద్యార్థినికి సైకిల్ బహుమతిగా అందిస్తానని ఆమె తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించి ఉత్తమ ఫలితాల సాధనకు దోహదపడతాయన్నారు. చిన్న చిన్న కార్యక్రమాల ద్వారా పెద్ద పెద్ద మార్పులు తీసుకు రావచ్చని ఆమె తెలిపారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సర్పంచ్ మందడపు సత్యనారాయణ తో పాటు స్థానిక మాజీ ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. హెచ్ఎం కరుణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో రాములు, సర్పంచ్ తేజావత్ శంకర్, ఉప సర్పంచ్ ముకుందమ్మ, మాజీ సొసైటీ ఛైర్మన్లు మందడపు సుధాకర్, తుమ్మలపల్లి మోహన్రావు, ఏఎపి ఛైర్మన్ ప్రమీల, మాజీ ప్రజాప్రతినిధులు మందడపు మాధవరావు, భూక్యా లక్ష్మణ్ నాయక్, పద్మావతి, ఏసుబు, చెన్నులింగం, తులసి, పుల్లయ్య, కృష్ణవేణి, భిక్షం, దీప్లానాయక్, ఉపాధ్యాయులు,





# పలు పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత అవగాహన సదస్సు

**రోడ్డు భద్రతపై విద్యార్థుల తల్లిదండ్రులకు పోస్ట్ కార్డులు ద్వారా అవగాహన కల్పించిన పోలీసులు..**

**ఆర్మూర్, (సింగిడి):** రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా బుధవారం రోజున కమ్మర్పల్లి మండల ఎస్సై, జి. అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు చిల్డ్రన్ రోడ్ సేఫ్టీ డే కార్యక్రమాన్ని అరైవ్ అలీవ్ క్యాంపెన్లో భాగంగా విద్యార్థులకు భద్రతపై కమ్మర్పల్లి మండల కేంద్రంలో గల ఉన్నత పాఠశాలలో, కమ్మర్పల్లి మండలంలోని చౌటుపల్లి, ఉప్పులూరు, ఆశా కొత్తూర్, కోనాపూర్, బషీరాబాద్, కోన సముందర్ గ్రామాలలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత పై కమ్మర్పల్లి మండల ఎస్సై జి అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ అవగా హన కార్యక్రమాలు నిర్వహించారు.

**. . . తల్లిదండ్రులకు , విద్యార్థులకు విజ్ఞప్తి...**

రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ పై ముఖ్య ఘట్టాలను విద్యార్థులచే వారి తల్లిదండ్రులకు ట్రాఫిక్ నిబంధనల ఆవశ్యకతను తెలియజేస్తూ, ఓటు కార్డులు రాయించే వినూత్న కార్యక్రమాన్ని కమ్మర్పల్లి మండల పోలీసులు నిర్వహించారు. నాన్న దయచేసి నాకోసం, అమ్మ కోసం హెల్మెట్ వాడండి, మద్యం సేవించి వాహనం నడపకండి, మన కుటుంబం సంక్షేమంగా ఉండాలంటే ట్రాఫిక్ నిబంధనలు, భద్రతలు పాటిస్తూ మన కుటుంబ సభ్యులందరికీ పాటించాలంటూ, భావోద్వేగా భరితమైన, సూటి అయిన సందేశాలతో కూడిన పోస్ట్ కార్డులను విద్యార్థిని, విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పోస్ట్ కార్డులు రాసి పంపించారు. ఇంటి పెద్దల కు మార్పు రావాలని ఉద్దేశంతో పిల్లల ద్వారా ఈ చేసిన ప్రయత్నం అందరిని ఆకట్టుకుంది. పిల్లలు సైతం పోలీసుల అవగాహన పట్ల హర్షం వ్యక్తం చేశారు.



**. . . ఇతర అవగాహన కార్యక్రమాలు...**

దీంతోపాటు విద్యార్థులకు సురక్షితంగా రోడ్డు దాటడం పై పై, సీటు బెల్టు ధరించడం, హెల్మెట్ వాడకం, స్కూల్ కు వెళ్లే బస్సుల్లో భద్రత అంశాలపై, కమ్మర్పల్లి మండల పోలీసులు డెమో ద్వారా విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా మైనర్ల డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, పాఠశాలల వద్ద అతివేగం వంటి వాటిపై కఠినంగా వ్యవహరిస్తా మని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబం ధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కమ్మర్పల్లి మండల ఎస్సై, జి. అనిల్ రెడ్డి తో పాటు పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో మానవహారం విద్యార్థులతో పాటు పోలీసులు కలిసి నిర్వహించి విద్యార్థుల్లో ఆనంద ఉత్సవాలను నింపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

### జావేద్ మృతి పట్ల టి జె ఎఫ్ ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ తీవ్ర సంతాపం



**ఖమ్మం ప్రతినిధి, (సింగిడి):** సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఖమ్మం నగర మాజీ అధ్యక్షులు మహ్మద్ జావేద్ సూర్యాపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల టియు డబ్ల్యూ జె (టి జె ఎఫ్) ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ ఒక ప్రకటనలో తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. రోడ్డు ప్రమాదంలో మహ్మద్ జావేద్ మృతి ఘటన కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు తీరని లోటని, ప్రజా సేవలో ఆయన చూపిన నిబద్ధత, సామాజిక కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని యు డబ్ల్యూ జె (టి జె ఎఫ్) ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ కొనియాడారు. ఈ సందర్భంగా జావేద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. వారి కుటుంబానికి మనోధర్యం కలగా లని, జావేద్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని వేడుకున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

**పభుత్వ ఆసుపత్రిలో సమస్యల పరిష్కారానికి కృషి**

**గద్వాల జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్, ఎమ్మెల్యే**

**గద్వాల బ్యూరో (సింగిడి):**
గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కమిటీ సభ్యులు, వైద్యాధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తో కలిసి కలెక్టర్ మాట్లాడారు.

ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, ఇతర సిబ్బందిని నిబంధనల ప్రకారం నియమించేందుకు ముందుకెళ్లాలన్నారు. ఆసుపత్రిలో ఆయా విభాగాల వారీగా అవసరమైన పరికరాలు, ఇతర వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆసుపత్రి నిధులను ప్రాధాన్య క్రమంలో వినియోగించాలని సూచించారు. ఆసుపత్రి వద్ద పార్కింగ్ సమస్య లేకుండా అవసరమైన చర్యలు



తీసుకోవాలన్నారు. మెప్మా కు సంబంధించిన అర్బన్ సెల్టర్ హోమ్ నిర్మాణానికి గతంలోనే రూ. కోటికి పైగా నిధులు మంజూరు కావడంతో తగిన స్థలంలో నిర్మించాలన్నారు. సదరన్ సర్టిఫికెట్స్ క్యాంపుకు వచ్చే దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. గాంధీ చౌక్ లోని పాత జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో పలు గదులు ఖాళీగా ఉండడంతో అక్కడికి ఆయుష్ ఆసుపత్రిని తరలించేందుకు ఆలోచించాలన్నారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ గద్వాల నుంచి ఇప్పటికి చాలా మంది రోగులు మెరుగైన వైద్య సేవల కోసం కర్నూల్ వెళ్లాల్సి వస్తోందని, జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా సేవలందించాలన్నారు. గద్వాల జనరల్ ఆస్పత్రిలో అన్ని శస్త్ర చికిత్సలు చేసేందుకు అవసరమైన వైద్యులు, యంత్ర పరికరాలను అందుబాటులో ఉంచాల్సి ఉందన్నారు. గర్భిణీలు ప్రసవాల కోసం ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే సిజేరియన్లు ఎక్కువగా చేస్తున్నారని, రూ. 30 వేలకు పైగా బిల్లులు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు అధికంగా చేయాలన్నారు. గద్వాల జనరల్ ఆస్పత్రిలో జనరేటర్ల నిర్వహణకు అవసరమైన నిధులను కేటాయించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ల స్థానాలతో పాటు, ఇతర వైద్య సిబ్బందినీ పూర్తి స్థాయిలో నియమించేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. వైద్య ఆరోగ్యశాఖ తరపున రోగులకు మంచి వైద్య సదుపాయాలు కల్పించినప్పుడే ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలుగుతుందని, ఆ దిశగా సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో పనిచేయాల్సి ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, ఆసుపత్రి పర్యవేక్షకులు ఇందిర, మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, టీజిఎంఎస్ఐ డిసి డిఈ శ్రీనివాసులు, ఏఈ రహీం, కమిటీ సభ్యులు శ్రీధర్ గౌడ్, ఇతర వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
12-7-2026

## పేదోడి సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వం.

### శాసనసభ్యులు కాలే యాదయ్య.
### దుద్దాగులో నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం





**చేవెళ్ల (సింగిడి):** పేదోడి సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని శాసనసభ్యులు కాలే యాదయ్య అన్నారు..బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని దుద్దాగు గ్రామంలో నూతనంగా నిర్మించిన గూడెం చంద్రకళ, ఇందిరమ్మ ఇంటిని స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య గ్రామ సర్పంచ్ కావలి లక్ష్మి ప్రసన్న శేఖర్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ... పేదల గృహ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంతేకాకుండా, పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలంటే సొంత ఇల్లు అత్యవసరమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా సర్పంచ్ కావలి లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ... ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెంటయ్య గౌడ్, చేవెళ్ల మండల నాయకులు, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు పడాల ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ న్యాలట బుచ్చయ్య, సింగప్పగూడెం, సర్పంచ్ రవి, తల్లారం దుద్దాగు. ఉప సర్పంచ్ మొహమ్మద్ నవాజ్ వార్డు నెంబర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

### మక్క కొనుగోలు కేంద్రాలు
## ప్రారంభించి తుకం మరిచారు
### మాజీ పిఎసిఎస్ చైర్మన్ నేరెళ్ల మోహన్ రెడ్డి



**మల్లాపూర్, (సింగిడి)::** మల్లాపూర్ మండల కేంద్రంలో మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి తుకం మరిచారని మాజీ పి ఎస్ సి ఎస్ చైర్మన్ చిట్టాపూర్ నేరెళ్ల మోహన్ రెడ్డి జిల్లా మార్క్ పెడ్ ఎండికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ మల్లాపూర్ మండలంలో కేవలం రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నం చేస్తున్నారని రైతులు గత నెల రోజులుగా కొనుగోలు కేంద్రంలో పడిగాపులు కాస్తున్న వారిని పట్టించుకునే నాధుడే లేడని విమర్శించారు. మార్క్ పెడ్ ఎండి కి మక్కల తూకం వెంటనే ప్రారంభించాలని వినతి పత్రం అందజేయడంతో సానుకూలంగా స్పందించరనీ గురువారం రోజున మార్కెట్ లో తూకం ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. దాదాపు నెల రోజులుగా మక్కలు కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందుల గురయ్యారని, రాజకీయాలు పక్కన పెట్టి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం దృష్టి సాదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల మోహన్ రెడ్డి, సురుకంటి అంజిరెడ్డి, రోడ్డ మహేష్ యాదవ్, మోహన్ రెడ్డి, హనుమాన్లు, లింగంపల్లి వంశీ, సంజీవరెడ్డి, గంగారెడ్డి, లింగంపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆటో యునియన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**బుగ్గారం, (సింగిడి):** జగిత్యాల జిల్లా బుగ్గారం శ్రీ ముత్యాల పోచమ్మ నల్ల పోచమ్మ ఆటో యూనియన్ అధ్యక్షులు గా కప్పల లచ్చయ్య , ఉపాధ్యక్షులు గా మసర్తి మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా పోగుల తిరుపతి, సలహాదారులు బొద్దుల శివకుమార్, కేతి రాజన్న, ర్రైటర్లు నక్క చంద్రమౌళి, బి పోషన్న లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని శాలువా లతోని సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ అద్యక్షులు ఎన్ తిరుపతి, చుక్క శంకరయ్య , కప్పల రెడ్డి, పి రెడ్డి , పి రాజన్న, చుక్క కొమురయ్య, రెబ్బ ప్రశాంత్, పి రాజు, నక్క భీమయ్య, టీ నారాయణ , సుంకం గంగారెడ్డి, ఏం పోషమల్లు, తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి పట్టణ కార్యవర్గాన్ని ప్రకటించిన
## పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు



**జమ్మికుంట, (సింగిడి):** జిల్లా సంఘటన పర్వ్ లో భాగంగా జమ్మికుంట పట్టణ కార్యవర్గ జాబితాను కరీంనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు పట్టణ బిజెపి కార్యవర్గాన్ని ప్రకటించారు. బిజెపి పట్టణ ఉపాధ్యక్షులుగా గర్రెపల్లి నిరూప రాణి, ఆడువాల శ్రీధర్, కొమ్ము అశోక్, కేస స్వరూప, ప్రధాన కార్యదర్శులుగా కైలాసకొటి గణేష్, రాచపల్లి ప్రశాంత్, కార్యదర్శులుగా రాకేష్ ఠాకూర్, ఆకుల తిరుపతి, వాల్లాల సతీష్ బాబు, రాయబారపు సురేష్, కోశాధికారి గా కొండ్లె నగేష్, మరో 34 మందిని పట్టణ కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. మాపై నమ్మకంతో పట్టణ కమిటీలో మాకు అవకాశం కల్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్న, జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు కు కృతజ్ఞతలు తెలిపారు.

## గాంధీనగర్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు .. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు






**హుస్నాబాద్(సింగిడి):** హుస్నాబాద్ మండలం గాంధీనగర్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం బుధవారం నాడు అత్యంత వైభవంగా జరిగింది. పాఠశాల ప్రాంగణం విద్యార్థుల కోలాహలం మరియు సాంస్కృతిక ప్రదర్శనలతో పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సినిమా పాటలతో పాటు మన తెలంగాణ మట్టి వాసనను, సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే జానపద గేయాలకు విద్యార్థులు అద్భుతమైన నృత్యాలతో అలరించారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ వేడుకలో పలు కీలక విషయాలను ప్రస్తావించారు. నేటి పోటీ ప్రపంచంలో కేవలం పుస్తక పఠనమే కాకుండా, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను మరియు కళాత్మక నైపుణ్యాలను వెలికితీయడమే ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని వక్తలు పేర్కొన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తూ, ఉన్నతమైన ఆశయాలను కలిగి ఉంటేనే విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప స్థాయికి చేరుకుంటారని, దేశాభివృద్ధిలో భాగస్వాములు అవుతారని ఆకాంక్షించారు. చదువుతో పాటు ఇలాంటి వేదికలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని, అది వారి కెరీర్‌కు ఎంతో దోహదపడుతుందని ఉపాధ్యాయులు వివరించారు. ఈ పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణాదేవి నేతృత్వంలో ఉపాధ్యాయులు సునీత, సంతోషిణి, రాశి విద్యార్థులను ప్రోత్సహిస్తూ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి ఎల్లవేళలా అండగా నిలిచే దాతలు జనగామ నారాయణరావు, కమలాకర్ రావు ఈ వేడుకలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. వీరితో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మంచాల రేణుక, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానంతో ఈ వార్షికోత్సవ సంబరాలు స్ఫూర్తిదాయకంగా ముగిశాయి.

## బిడిఎల్ భానుర్ సిఐఎస్ఎఫ్ యూనిట్‌లో అగ్నిమాపక సేవా దినోత్సవ వేడుకలు





**చేవెళ్ళ (సింగిడి):** బిడిఎల్ భానుర్ సిఐఎస్ఎఫ్ యూనిట్‌లో జాతీయ అగ్నిమాపక సేవా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిడిఎల్ భానుర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్. కిషన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అసిస్టెంట్ కమాండెంట్/ఫైర్ శ్రీ అర్షద్ అలీ ఖాన్ ముఖ్య అతిథికి మరియు హాజరైన ఇతర ప్రముఖులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్ర మంలో, 1944 సంవత్సరంలో బాంబే డాక్‌యార్డ్‌లో ఆ తర్వాతి సంవత్సరాలలో జరి గిన అగ్నిప్రమాదాలలో మరణించిన అగ్నిమాపక సిబ్బందికి షహీద్ స్మారక్ వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళు లర్పించారు. అనంతరం, అక్కడికి వచ్చిన ఇతర అధికారులు మరియు ప్లాంట్ ఉద్యోగులు కూడా పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో, 14 ఏప్రిల్ 2026 నుండి 14 ఏప్రిల్ 2026 వరకు గల అగ్నిమాపక నివేదికను యూనిట్ కమాండర్ డిప్యూటీ కమాండెంట్ శ్రీ సి. శ్రీరామ్ తేజస్వి సమర్పించారు. బిడిఎల్ భానుర్ సిఐఎస్ఎఫ్ యూనిట్ యొక్క ఫైర్ వింగ్, నేడు ప్రారంభించబడుతున్న అగ్నిమాపక సేవా వారోత్సవాలను నిర్వహిస్తోంది. తన ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ, ప్లాంట్ ఉద్యోగులు, సాధారణ పౌరులు మరియు ఇతరులకు అగ్ని భద్రతపై అవగాహన కల్పించడమే అగ్నిమాపక సేవా వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. గతంలో జరిగిన వివిధ రకాల అగ్ని ప్రమాదాలను వివరిస్తూ, అగ్ని భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు మరియు మార్గదర్శకాలను మన ఆచరణాత్మక జీవితాలలో అలవర్చుకున్నప్పుడే అగ్నిమాపక సిబ్బందికి నిజమైన నివాళి అర్పించగలమని ఆయన అన్నారు. అటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండేలా లేదా వాటి సంఖ్య తగ్గేలా మనం చర్యలు తీసుకోవాలి. ఈ అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా, భానుర్‌లోని బీడీఎల్ సీఐఎస్ఎఫ్ యూనిట్ అగ్ని భద్రతపై వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఆయన తెలియజేశారు. భానుర్‌లోని బీడీఎల్ సీఐఎస్ఎఫ్ యూనిట్ యొక్క ఫైర్ వింగ్, బీడీఎల్ భానుర్‌లోని డీఏవీ పాఠశాల, ఎద్దుమైలారంలోని పీఎంకేవీ ఓడీఎఫ్ పాఠశాల మరియు భానుర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల సిబ్బంది పిల్లల కోసం వివిధ పోటీలతో పాటు ప్రథమ చికిత్స మరియు అగ్నిమాపక శిక్షణను నిర్వహిస్తోంది. ఇంకా బీడీఎల్ ఆసుపత్రి, ప్లాంట్ సిబ్బంది, ఉద్యోగులు మరియు కార్మికులు, సీఐఎస్ఎఫ్ భద్రతా విభాగం దళ సభ్యులు మరియు సీఐఎస్ఎఫ్, బీడీఎల్‌కు చెందిన మహిళా గృహిణుల కోసం కూడా ఈ శిక్షణలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో వారి ఇంటి భద్రత గురించి, అగ్ని ప్రమాదాలకు గల కారణాల గురించి మరియు వాటిని వారి సొంత స్థాయిలో ఎలా ఆర్పివేయాలో సమాచారం ఇవ్వబడుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీడీఎల్ భానుర్ సైట్ కార్యనిర్వాహక సంచాలకుడు శ్రీ ఎల్. కిషన్, తన ప్రసంగంలో సి ఐ ఎస్ ఎఫ్ అగ్నిమాపక విభాగం ఫైర్ వింగ్ పనితీరును అభినందించారు మరియు ఆ విభాగంపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అంతేకాకుండా, సి ఐ ఎస్ ఎఫ్ కు అవసరమైన అన్ని ఆధునిక మరియు అత్యాధునిక అగ్నిమాపక పరికరాలను బి.డి.ఎల్. భానుర్ యాజమాన్యం సమకూరుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమం చివరలో, తమ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి హాజరైన ప్రముఖులకు కృతజ్ఞతా వందనాలు సమర్పించారు.

### దుండ్ర సుమన్‌కు
## 'దళిత రత్న' పురస్కారం
### గాంధీనగర్ సర్పంచ్ పోలు సంపత్ అభినందనలు



**హుస్నాబాద్, (సింగిడి)::** హుస్నాబాద్ మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన యువకుడు దుండ్ర సుమన్ ప్రతిష్ఠాత్మకమైన "దళిత రత్న" పురస్కారాన్ని అందుకోవడం పట్ల గాంధీనగర్ గ్రామ సర్పంచ్ పోలు సంపత్ హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా సుమన్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి అతనికి ఈ అవార్డును ప్రదానం చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దుండ్ర సుమన్ చిన్న వయసులోనే బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ, గ్రామ అభివృద్ధిలో మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమన్నారు. గాంధీనగర్ గ్రామానికి చెందిన వ్యక్తికి ఇలాంటి ఉన్నతమైన పురస్కారం దక్కడం గ్రామ ప్రజలందరికీ గర్వకారణమని సర్పంచ్ కొనియాడారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం సుమన్ చేస్తున్న కృషికి ఈ అవార్డు తగిన గుర్తింపు అని ఆయన అభివర్ణించారు. భవిష్యత్తులో సుమన్ మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని, తన సేవా గుణంతో గ్రామానికి మరింత మంచి పేరు తీసుకురావాలని సర్పంచ్ పోలు సంపత్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు మరియు పలువురు నాయకులు పాల్గొని దుండ్ర సుమన్‌కు తమ అభినందనలు తెలియజేశారు.

## అల్ఫోర్స్ సీబీఎస్ఈ విద్యార్థుల అద్భుత ఫలితాలు

### జిల్లా స్థాయిలో రికార్డు మార్కులతో సరికొత్త చరిత్ర... అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి




**కరీంనగర్, (సింగిడి):** వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, సరైన ప్రణాళికలు, నాణ్యమైన బోధనతో విద్యార్థులు విశిష్ట ఫలితాలు సాధించగలరని తెలిపారు. తాజాగా విడుదలైన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో అల్ఫోర్స్ హై స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మొత్తం 103 మంది విద్యార్థులు 500 మార్కులకు గాను 450కు పైగా మార్కులు సాధించి జిల్లా స్థాయిలో కొత్త రికార్డు సృష్టించారు. సానీక 494 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, ఆదిత్య 492 మార్కులు సాధించాడు. ఎం. శ్రీహిత, వి. హర్ష, ఏ. శ్రీనిత తలా 490 మార్కులు, కే. ఓం కార్తికేయ, కె. అస్మిత, కే. అభిజ్ఞ 488 మార్కులు సాధించారు. ఇతర విద్యార్థులు కూడా 487 నుంచి 483 మధ్యలో ఉన్న ఉన్నత మార్కులు సాధించి ప్రతిభ చాటారు. పలు విషయాల్లో విద్యార్థులు శాతం మార్కులు పొందడం విశేషం. అల్ఫోర్స్ విద్యాసంస్థలు ప్రారంభం నుంచి సీబీఎస్ఈలో ప్రాధాన్యత సాధిస్తూ, విద్యార్థుల విజయాలకు దోహదపడుతున్నాయని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగ జేఏసీ నాయకులు

### ఏప్రిల్ 17న నల్ల బ్యాడ్జీలతో భోజన విరామ ధర్నాకు అనుమతి.. జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి



**కరీంనగర్, (సింగిడి):** స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి చిత్రా మిశ్రా ను ఉద్యోగ జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏప్రిల్ 17న మధ్యాహ్నం 1 గంటకు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిర్వహించనున్న ధర్నాకు అనుమతి పొందారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఈ కార్యక్రమం వ్యక్తిగత సమస్యల కోసం కాదని, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థ సక్రమంగా నడవడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని, విపత్తులు, ఆరోగ్య అత్యవసరాలు, శాంతిభద్రతలు, నీటి సరఫరా, పరిశుభ్రత, విద్య, వైద్యం, సంక్షేమ పథకాల అమలులో వారు ప్రధాన భూమిక పోషిస్తున్నారని పేర్కొన్నారు. అయితే డీఏ, వార్షిక వృద్ధులు, వేతన సవరణ, సీనియార్టీ ఆధారిత పదోన్నతులు వంటి హక్కుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి ఉద్యోగుల హక్కులేనని స్పష్టం చేశారు. ఉద్యోగుల వేతనాల్లో 15 శాతం మొత్తాన్ని తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసే నిర్ణయాన్ని స్వాగతించినప్పటికీ, వృద్ధులకు ఆర్థిక సహాయం మాత్రమే సరిపోదని, వారికి ప్రత్యక్ష సంరక్షణ అవసరమని అన్నారు. బదిలీల కారణంగా కుటుంబాల నుండి దూరమవుతున్న ఉద్యోగులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వృద్ధ తల్లిదండ్రులు ఉన్నవారిని స్వస్థల జిల్లాల్లోనే కొనసాగించేలా సడలింపులు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా, దీర్ఘకాలం సేవలందించిన విరమణ పొందిన ఉద్యోగులు తమ ప్రయోజనాల కోసం ఎదురుచూస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగి బలంగా ఉంటే ప్రభుత్వం బలంగా ఉంటుంది, ప్రభుత్వం బలంగా ఉంటే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుంది" అని పేర్కొంటూ, ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### నారీశక్తితో నవభారత నిర్మాణం
## మహిళా రిజర్వేషన్ బిల్లుకు స్వాగతం

### స్కూటీ ర్యాలీ ద్వారా మహిళా శక్తి ప్రదర్శన: బిజెపి మహిళా మోర్చా



**కరీంనగర్, (సింగిడి):** దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలుకుతూ మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే నారీశక్తి వందన్ అధినియాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ తెలిపారు. ఈ చట్టం మహిళలకు ఒక అపూర్వ కానుకగా నిలిచి, నవభారత నిర్మాణానికి దోహదం చేస్తుందని ఆమె పేర్కొన్నారు. ఏప్రిల్ 16న పార్లమెంట్ ప్రత్యేక సమావేశం సందర్భంగా ఈ బిల్లును ప్రవేశపెట్టడాన్ని పురస్కరించుకుని, కరీంనగర్‌లో బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో స్కూటీ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఆర్ఆర్ కళాశాల నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా మార్క్ ఫెడ్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నగర మేయర్ కోలగని శ్రీనివాస్, ఉప మేయర్ సునీల్ రావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ, మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం గత ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం మహిళల సాధికారతకు కట్టుబడి పనిచేస్తోందనీ, చట్టసభల్లో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా చారిత్రక మార్పుకు శ్రీకారం చుట్టిందని అన్నారు. ఈ కార్యక్రమం లో రమణారెడ్డి, సాయిని మల్లేశం, గుజ్జ శ్రీనివాసరావు, శశిధర్, బీజేవైఎం సంపత్, గుగ్గిళ్ళ రమేష్, సత్యనారాయణ రెడ్డి, సోమిరెడ్డి వేణు,, సునీత, స్వప్న, లావణ్య రెడ్డి, చైతన్య,, నరేడ్ల ప్రవీణ్ చంద్ర,, బండారి వేణు, చంద్రిక, వివిధ డివిజన్ మహిళలు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ వద్దు... తహసిల్దార్‌కు వినతి

### జేఏసీ మద్దతుగా ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షులు వన్నాల శివాజీ ఆధ్వర్యంలో.
### మండలంలోని 20 గ్రాముల ఉపసర్పంచులు అందరూ డంపింగ్ యార్డ్ రద్దుకు మద్దతులు.



**హుజురాబాద్ , (సింగిడి):** హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద గత24 రోజులుగా వేస్ట్ టు ఎనర్జీ పవర్ రైట్ నిర్మాణ రద్దు కొరకై నిరవధిక దీక్ష కొనసాగిస్తున్న అఖిలపక్ష జేఏసీ మద్దతుగా ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షులు వన్నాల శివాజీ ఆధ్వర్యంలో హుజురాబాద్ మండలంలోని 20 గ్రాముల ఉపసర్పంచులు అందరూ వేస్ట్ టు ఎనర్జీ పవర్ ప్లాంట్ రద్దు కొరకై మద్దతుగా సంఘీభావం తెలుపుతూ ఒక్కరోజు దీక్షలో కూర్చోవడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షులు వన్నాల శివాజీ మాట్లాడుతూ, వేస్ట్ టు ఎనర్జీ పవర్ ప్లాంట్ డంపింగ్ యార్డ్ రద్దు అయ్యేంతవరకు మేమంతా ఉప సర్పంచ్ గా ఉప సర్పంచ్ల అందరు మండలంలోని అన్ని గ్రామాల ఉపసర్పంచులు ఏక స్తులమై మా వంతు కృషిగా ప్రభుత్వానికి శాంతియుతంగా పై అధికారులకు ఈ జటిలమైన సమస్యని తెలిపి డంపింగ్ యార్డ్ రద్దయ్యేంత వరకు పోరాటం చేస్తామని తెలుపుతున్నాము. డంపింగ్ యార్డ్ రద్దు అయ్యేంత వరకు పోరాటం చేస్తామని తెలుపు తున్నాము. అలాగే మద్దతుగా మండలంలోని ఉప సర్పంచులు మంద సతీష్, శనిగరపు ఐలయ్య, గీసిడి శైలజామా, మహేందర్ రెడ్డి, బండి రాజు, బండి నరేష్, జనగామ రాజేశ్వరరావు, ఇప్పలపల్లి రామకృష్ణ, గిన్నారపు మహేందర్, బొల్లవేణి అజయ్, ఆవుల రాజకుమార్, నేరెళ్ల శ్రీనివాస్, జడల అశోక్ కుమార్, ఆవుల సంపత్, కాశిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నారాయణరెడ్డి, బిక్షపతి, జాలి బలరాం రెడ్డి, పంజాల రాజు, సుధాకర్ లతో పాటు అఖిల పక్ష జేఏసీ సభ్యులు జనార్దన్, సందేల వెంకన్న, హనుమంత రావు, జైపాల్ రెడ్డి, సీనియర్ బిఆర్ఎస్ నాయకులు కొండల్ రెడ్డి, కాట్రపల్లి మాజీ సర్పంచ్ తొగరు బిక్షపతి, పాల్గొని మద్దతు తెలిపి స్థానిక తహసిల్దార్ కు మెమోరాండం ఇవ్వడం జరిగింది.

సినిమా సింగిడి
Cinma Singidi

ఆదివారం
12-7-2026




# తండ్రిని హత్తుకున్న అఖిల్

అఖిల్ మూవీ హిట్ అయితే చూడాలని ఆశగా ఎదురుచూసిన అక్కినేని అభిమానుల కల నెరవేరింది. ఆయన కథానాయకుడిగా మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందిన రూరల్ యాక్షన్ డ్రామా 'లెనిన్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ముఖ్యంగా అఖిల్ నటన, ద్వితీయార్ధంలో వచ్చే ట్విస్ట్‌లు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. ఈ సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ సక్సెస్ సెలబ్రేషన్స్ జరిగాయి. చిత్ర బృందం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంది. ఈ సందర్భంగా తండ్రి నాగార్జున పాదాలకు నమస్కరించిన అఖిల్.. ఆయన్ను గట్టిగా హత్తుకుని భావోద్వేగానికి గురయ్యారు.



## మురుగన్ నేపథ్యంలో చిత్రాల నిర్మాణం

# తెలుగు, తమిళంలో కార్తికేయుడి నేపథ్యంలో సినిమాలు

దక్షిణాది సినీ పరిశ్రమలో దైవిక, పురాణ గాథల నేపథ్యానికి నయా క్రేజ్ మొదలైంది. ఒకప్పుడు పౌరాణిక కథలకు కేరాఫ్ అడ్రస్‌గా కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలు మళ్లీ అదే బాట పట్టినట్లు తెలుస్తున్నాయి. ప్రస్తుతం తమిళ, తెలుగు సినీ రంగాలలో లార్డ్ మురుగన్ (సుబ్రమణ్య స్వామి) కాన్సెప్ట్ ఒకవైపు భారీ ట్రెండ్‌గా మారుతోంది. టాలీవుడ్, కోలీవుడ్ ప్రముఖ దర్శకులు, అగ్ర హీరోలు మురుగన్ బ్యాక్‌డ్రాప్‌లో ప్రతిష్టాత్మక చిత్రాలను ప్రకటించడం సోషల్ మీడియా వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ట్రెండ్‌ను మొదటిగా కోలీవుడ్ హీరో శివకార్తికేయన్ ప్రారంభించాడు అని చెప్పవచ్చు. శివకార్తికేయన్ పుట్టినరోజు పురస్కరించుకుని విడుదలైన ఒక గ్లింప్స్ ఇటీవలే అందరి దృష్టిని ఆకర్షించింది. శివకార్తికేయన్ ప్రధాన పాత్రలో లోకనాయకుడు కమల్ హాసన్ భారీ నిర్మాణంలో, శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'సేయోన్' అనే చిత్రం ఈ మురుగన్ సెంటిమెంట్‌కు పునాది వేసింది. తమిళ ప్రాచీన సంస్కృతి, సాహిత్యంలో కార్తికేయుడిని 'సేయోన్' అని




పిలుస్తారు. ఈ చిత్ర గ్లింప్స్‌లో శివకార్తికేయన్ విరుమాండి స్వామి పూనకం వచ్చినట్లుగా, అత్యంత ఊరమాస్ లుక్‌లో పల్లెటూరి జాతర నేపథ్యంలో కనిపించి అభిమానులను అలరించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ యాక్షన్ డ్రామాను అక్టోబర్ లో గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ మరియు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఒక భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ అనౌన్స్ అయింది. ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ విస్తృతంగా ప్రచారంలో ఉంది. దీంతో ఈ ప్రాజెక్ట్ కూడా మురుగన్ జీవితంపై రాబోతుండడంతో టాలీవుడ్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఈ సినిమా ప్రకటన సమయంలో నిర్మాత నాగవంశీ సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ తీవ్ర వివాదానికి దారితీసింది. మురుగన్ స్వామి 'ఉత్తరాదిన జన్మించాడు.. దక్షిణాదిన పూజించబడుతున్నాడు' అంటూ ఆయన పేర్కొన్న వ్యాఖ్యలపై తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తమిళులు తమ ప్రాచీన దేవుడైన 'తమిళ్ కడవుల్' (తమిళ దేవుడు) మురుగన్‌ను ఉత్తరాది మూలాలతో ముడిపెట్టడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఎన్టీఆర్ సినిమాపై ఈ రకమైన రాజకీయ, ప్రాంతీయ దుమారం రేగుతున్న తరుణంలోనే, ధనుష్ మరియు వెట్రిమారన్ కాంబినేషన్‌లో 'తమిళ్ మురుగన్' ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్‌లో ధనుష్ ఒక భారీ ఏనుగుపై గంభీరంగా కూర్చొని, చేతిలో మురుగన్ స్వామి యొక్క శక్తివంతమైన ఆయుధం 'వేల్' (ఈటె) పట్టుకుని, ఒక భారీ సైన్యం ముందు తమిళ ప్రజలకు, ఆ నేలకూ రక్షకుడిగా కనిపించారు. అయితే ఒకప్పుడు భక్తిరస చిత్రాలుగా వచ్చిన దేవుళ్ల కథలు, ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో భారీ బడ్జెట్ యాక్షన్ డ్రామాలుగా, అలాగే ప్రాంతీయ అస్తిత్వానికి ప్రతీకలుగా మారుతున్నాయి.

## 24న రామాయణ

# ట్రైలర్ విడుదల

భారతీయ చిత్ర పరిశ్రమ చరిత్రలోనే భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. విడుదలకు ముందే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఇదీ ఒకటి. ఈ మూవీలో రాముడిగా బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని ప్రకటించింది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది. కొన్ని వేల సంవత్సరాలుగా ధర్మం, మర్యాద, ధైర్యం, కరుణ అనే ఆదర్శాలతో 'రామాయణం' ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చింది. మన నాగరికతకు అద్దం పట్టే ఈ గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేయబోతున్నాం అని ఇన్‌స్టాలో చిత్రబృందం పోస్ట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవితో పాటు పలువురు అగ్ర తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా తెలిపారు.




# ఓ సుకుమారి ట్రైలర్ విడుదల

'మసూద', 'పరేషాన్' చిత్రాలతో వైవిధ్యమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్, టాలెంటెడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ 'ఓ సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్ గుడ్ మ్యూజికల్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ, ఆ తర్వాత వారి జీవితాల్లో వచ్చే మలుపుల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. తిరువీర్ తన మార్క్ సహజ నటనతో ఆకట్టుకోగా, ఐశ్వర్య రాజేష్ మరోసారి నటన ప్రాధాన్యమున్న పాత్రలో మెరిశారు. భరత్ మంచిరాజు అందించిన స్వరాలు, నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సున్నితమైన భావోద్వేగాలు, చక్కటి వినోదంతో కూడిన ఈ చిత్రం జూలై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మరో ప్రేమ కథాచిత్రం

# హృదయం మురళి

తమిళ హీరో అథర్వ 'హృదయం మురళి' అనే అనువాద చిత్రంతో బాక్సాఫీస్ బరిలో నిలిచారు. మనసులోని ప్రేమను బయటకు చెప్పలేని హృదయ (అథర్వ) అనే కుర్రాడి కథ ఇది. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయిన అతణ్ని మామయ్య (నట్టి సుబ్రహ్మణ్యం) అన్నీ తానై పెంచి పెద్ద చేస్తాడు. చిన్నప్పుడు స్కూల్లో తన ఇంగ్లీష్ టీచర్ గీత (జోనితా గాంధీ)పై పుట్టిన అమాయకపు క్రష్ నుంచి.. ట్యూషన్‌లో సమంత (ప్రీతి ముకుందన్).. కాలేజీ రోజుల్లో అముద (కయాదు).. ఇలా హృదయ జీవితంలో వివిధ దశల్లో పలు ప్రేమకథలుంటాయి. ప్రతి ఒక్కర్నీ గాఢంగా ప్రేమించినా.. మనసులోని ప్రేమను వ్యక్తపరచలేకపోతాడు. అయితే అదితి (మాళవిక మోహనన్)తో పెళ్లి పీటలెక్కడానికి పదిరోజుల సమయం ఉందనగా.. తన మనసులో దాగి ఉండిపోయిన ప్రేమని వ్యక్తపరిచేందుకు ఫ్రెండ్స్‌తో కలిసి న్యూయార్క్‌కి బయలుదేరుతాడు హృదయ. మరి ఆ తర్వాత ఏమైంది? సరిగ్గా పెళ్లికి ముందు తన గత ప్రేమ జ్ఞాపకాల్ని వెతుక్కుంటూ హృదయ ఎవరి దగ్గరకి వెళ్లాడు? ఈ ప్రయాణంలో తాను కోరుకున్నట్లుగా నిజమైన ప్రేమని దక్కించుకున్నాడా? సమంత, అముద, అదితిల్లో ఎవరితో కలిసి పెళ్లి పీటలెక్కాడు?




అన్నది మిగిలిన కథ. వన్ సైడ్ లవ్‌స్టోరీస్ వెండితెరకు కొత్తేమీ కాదు. అయితే వీటిలో మనసులోని ప్రేమను బయట పెట్టలేక ఒంటరి ప్రేమికులుగా మిగిలిన ప్రేమకథలెప్పుడూ ప్రత్యేకమే. ఈ 'హృదయం మురళి' కూడా ఆ కోవకు చెందిన చిత్రమే. అయితే దీన్ని 90ల నాటి నోస్టాల్జియా మూమెంట్స్‌తో ముడిపెట్టి.. పాత జ్ఞాపకాల్ని గుర్తు చేస్తూ.. ఈతరం ప్రేక్షకులకూ కనెక్ట్ అయ్యేలా వినోదాత్మకంగా తీర్చిదిద్దిన తీరు ఆద్యంతం అలరిస్తుంది. మనసులోని ప్రేమను బయటకు చెప్పలేని ప్రేమికుడిగా హృదయ పాత్రలో అథర్వ ఒదిగిపోయాడు. ఆద్యంతం చక్కని నటనతో కట్టిపడేశాడు. ప్రీతి ముకుందన్ తెరపై అందంగా కనిపిస్తూనే.. చక్కటి అభినయాన్ని చూపించే అవకాశం దొరికింది. ఆమె పాత్రకి ఇచ్చిన ట్విస్ట్ ఆకట్టుకుంటుంది. అముదగా కయాదు కనిపించినంత సేపూ అలరిస్తుంది. తమన్, నిహారిక, ద్రవిడ్ తదితరుల పాత్రలు కథని ముందుకు తీసుకెళ్లడంలో తమ వంతు పాత్ర పోషించాయి. నేపథ్య సంగీతం సినిమాకి తగ్గట్లుగా కుదిరింది. విజువల్స్, నిర్మాణ విలువలు బాగున్నాయి.



# భాగ్యశ్రీ బోర్సే..భావోద్వేగం

'లెనిన్'లో అఖిల్‌కు జోడీగా భారతి పాత్రలో నటించి ఆకట్టుకున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా కోసం టీమ్ ఎంతో కష్టపడిందని ఆమె తెలిపారు. తాజాగా ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. తన అభిమానులు తనను నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉన్నారని ఈ చిత్రబృందంతో పాటు వాళ్లందరి వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. హైదరాబాద్ తనకు కర్మభూమి అని చెప్పారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737